
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలంగా వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :81 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 31 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


### మోదీ రాజీనామా
# లేఖ వైరల్..

**పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పందనిదే..**

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా సూచించింది పీఐబీ. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో -



మిగతా3లో

### 21 ఏళ్ల లిమిట్ పై
# పెరుగుతున్న మద్దతు

**హైదరాబాద్, జూలై 30:** ప్రజాస్వామ్య వ్యవస్థలో వయోపరిమితి అంశం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసేందుకు ప్రస్తుతమున్న కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో కొత్త సంచలనాన్ని రేపింది. ఈ అంశంపై తెలంగాణ అసెంబ్లీలో త్వరలోనే ఒక అధికారిక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన స్పష్టం చేశారు. నేటి యువతలో ఆలోచనా పరిపక్వత పెరిగిందని, దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న యువత చట్టసభల్లో తమ వాయిస్‌ను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నది రేవంత్ రెడ్డి ప్రధాన వాదన. ఈ ప్రతిపాదనకు



పార్టీల సరిహద్దులు దాటి మద్దతు - మిగతా3లో

### వందేమాతరం బిల్లుకు
# పార్లమెంటు ఆమోదం



**ఇంటర్నెట్ డెస్క్:** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, - మిగతా3లో

### '2034 వరకు
# నేనే సీఎం'..

**ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ**
**టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం**
**విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు**
**55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య**
**ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం**
**ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ**

విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో




ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, - మిగతా3లో

### రెండు రోజులుగా వర్షాలు..
### అధికారులు అందరూ
# ఫీల్డ్‌లో ఉండాల్సిందే

**మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్, జులై 30:** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

### మహిళా, శిశు సంక్షేమ శాఖపై
# సీతక్క సమీక్ష..



**కీలక నిర్ణయాలు**

**హైదరాబాద్, జులై 30:** అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

### తెలంగాణలో
# భారీ వర్షాలు

**హైదరాబాద్:** తెలంగాణలో వర్షాలు జోరందుకున్నాయి. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రెండు రోజులుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతున్నాయి. ఆదివారం ఓ మోస్తరుగా మొదలైన చినుకులు.. గురువారం నాటికి అతిభారీ వర్షాలుగా మారాయి. ఈ సీజన్లో రెండు నెలలు వట్టిబోయిన వాగులు.. ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాష్ట్రమంతటినీ వర్షాలు పలకరించాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. సీజన్లోనే అత్యధిక వర్షపాతం మంగళవారం అర్ధరాత్రి నమోదైంది. దీంతో రాష్ట్రంలో మీడియం ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది.



నిన్నమొన్నటిదాకా - మిగతా3లో

### పంచాయతీ నిధుల పక్కదారిపై
# పూర్తి విచారణ జరపాలి

**కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ**
**పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్**
**నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ**
**నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం - మిగతా3లో



### ప్రధాని, హోంమంత్రి
# మౌనం వీడాలి..

**లేదంటే విద్యార్థులు మళ్లీ గుణపాఠం చెబుతారు: మల్లిఖార్జున్ ఖర్గే**

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే( ఇవాళ కేంద్రంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన విద్యార్థులన నిరసనను ఉద్దేశిస్తూ.. పోలీసుల చర్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మౌనాన్ని వీడాలని, లేదంటే మళ్లీ విద్యార్థులు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పోలీసుల లాఠీఛార్జ్ పట్ల ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. రాజ్యసభలో చర్చలో పాల్గొన్న ఖర్గే మాట్లాడుతూ.. నిరసనకారులపై దాడి పట్ల ప్రభుత్వం మౌనంగా



ఉందని, దీనిపై విద్యార్థులు నిరాశతో ఉన్నారన్నారు. ఒకవేళ వాళ్ల డిమాండ్లను పట్టించుకోకపోతే, వాళ్లు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపట్టనున్నట్లు ఖర్గే తన వార్నింగ్‌లో తెలిపారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా విద్యార్థుల నిరసనలపై మౌనంగా ఉన్నారని, ఒకవేళ వాళ్లు మాట్లాడకుంటే, వారికి విద్యార్థులు గుణపాఠం చెబుతారన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు కేంద్ర మంత్రి అమిత్ షా బాధ్యుడు అని, ఈ అంశంలో ఆయన - మిగతా3లో

## సంపాదకీయం

### కాంగ్రెస్ పార్టీకి
# నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.‘దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని ‘వికసిత్ భారత్‌గా’ తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది” అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

### సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై
# జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్

**తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అత్యవసర ఆదేశాలు**

**15 రోజుల్లో చర్యల నివేదిక సమర్పించాలని ఆదేశించిన జాతీయ ఎస్సీ కమిషన్**

**రైతుల తరపున ఢిల్లీ వరకు పోరాటం చేసిన షాద్ నగర్ బీజేపీ నేతల చొరవ ఫలితం**



**రంగారెడ్డి:** కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎసౌవీ) కేంద్రం ఏర్పాటుపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (చీజూజ) స్పందించింది. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ సమర్పించిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు అధికారిక లేఖ పంపింది.ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం, ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు, చిన్న రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్యం, రాజ్యాంగ హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతకంతో జారీ చేసిన లేఖలో, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విచారణ అనంతరం తీసుకున్న చర్యలు, సంబంధిత ఆధారాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను 15 రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**బీజేపీ నేతల చొరవతో ఢిల్లీ వరకు రైతుల పోరాటం**

సిద్ధాపూర్ రైతుల సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య కీలక పాత్ర పోషించారు. రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను కలిసి సమస్యను వివరించేలా సహకరించారు. వారి చొరవ, సమన్వయం ఫలితంగానే కమిషన్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖ ప్రతులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి కూడా పంపినట్లు లేఖలో పేర్కొన్నారు.

# ఉప్పొంగిన కాగ్నానది....



**వికారాబాద్:** ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు తాండూరు ప్రాంత ప్రజలకు ఊరటనిచ్చాయి. ఎండిపోయి వెలవెలబోయిన కాగ్నానది ఇప్పుడు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ నీటి ప్రవాహం రైతుల్లో కొత్త ఆశలను నింపగా... తాండూరు పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు తాత్కాలిక ఉపశమనాన్ని అందించింది. మరోవైపు అక్రమ ఇసుక రవాణాకు కూడా తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాలతో కాగ్నానది పరవళ్లు తొక్కుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు ఇసుక మేటలతో కనిపించిన నది... ఇప్పుడు జలకళను సంతరించుకుంది.నదిలోకి భారీగా నీరు చేరడంతో పరివాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి మట్టం మెరుగుపడుతుందని, రాబోయే సాగు సీజన్‌కు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇక తాండూరు పట్టణ ప్రజలకు కూడా ఈ ప్రవాహం ఊరటనిచ్చింది. తాగునీటి వనరులకు నీరు చేరడంతో కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది.మరోవైపు కాగ్నానదిలో నీటి ఉద్ధృతి పెరగడంతో అక్రమ ఇసుక తవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతిరోజూ ఇసుక కోసం నదిలోకి వచ్చే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు నీటి ప్రవాహం కారణంగా వెనుదిరిగాయి. దీంతో ఇసుక మాఫియా కార్యకలాపాలకు తాత్కాలికంగా చెక్ పడినట్లైంది.స్థానికులు మాత్రం ఇదే తరహాలో వర్షాలు కొనసాగి కాగ్నానది ఎప్పటికప్పుడు నీటితో కళకళలాడాలని, చెరువులు, కుంటలు నిండిపోవాలని, రైతులకు పుష్కలంగా సాగునీరు అందాలని కోరుకుంటున్నారు ప్రకృతి వరంగా వచ్చిన ఈ నీరు రైతుల్లో కొత్త ఆశలను చిగురింపజేయడమే కాకుండా... తాండూరు ప్రజలకు తాగునీటి ఊరటను అందించింది. అదే సమయంలో అక్రమ ఇసుక రవాణాపై కూడా తాత్కాలికంగా అడ్డుకట్ట వేసింది. కాగ్నానదిలో ప్రవాహం మరికొన్ని రోజులు కొనసాగుతుందా లేదా అన్నది రానున్న వర్షాలపై ఆధారపడి ఉంది.

# ఎర్రమిర్చికి ఊహించని ధర



**గుంటూరు, జూలై 30:** మిర్చి పంటను సాగు చేయడం కత్తి మీద సామే. ఏ మాత్రం తేడా వచ్చినా పంటంతా తెగుళ్లే. ఒకవేళ తెగుళ్ల నుంచి కాపాడుకున్నా నాణ్యమైన దిగుబడి రాదు. సరే ఆ వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండదు. దళారులు ఎంత చెప్తే అంతకి ఇచ్చి వెళ్తుంటారు. కానీ ఇక్కడో రైతు బయ్యర్లకే దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నెంబర్ వన్ నాటు రకాన్ని సాగు చేసి ఎర్రబంగారంలా మెరిసే మిర్చిని సాగు చేశాడు. రూ. 32 వేలు పలికినా ఇవ్వకుండా రూ. 40 వేల గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు.రైతు వేసిన పంట ఊహించిన దాని కంటే ఎక్కువ ధర పలికిందంటే ఆ రైతు పంట పండినట్టే. ఇక్కడ కూడా ఓ రైతు ఎర్రబంగారం సాగు చేశాడు. గుంటూరు మిర్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. మిర్చే కాదు ధర కూడా ఘాటెక్కింది. టాప్ క్వాలిటీ రావడంతో దళారులు ఆ పంట కోసం ఎగబడుతున్నారు. క్వింటాకు రూ. 32 వేలు ఇస్తామని ముందుకొస్తున్నా.. ఇంకాస్త ఎక్కువ ధర పలుకుతుందన్న ధీమాతో ఆ రైతు విక్రయించడం లేదు.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు చిట్టినేని అమర్‌నాథ్ నాటు రకం సూపర్ 10 డీలక్స్ మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో తొలి కాపు రాగా.. ధర పెద్దగా లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజ్‌లో పంటను నిల్వ చేశాడు.ఇటీవల కొద్ది కాలంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో ధరలు రైతులకు అనుకూలంగా ఉండటంతో తన పంటను విక్రయించేందుకు అమర్‌నాథ్ మూడు లాట్ల శాంపిల్స్‌ను తీసుకొచ్చాడు. యార్డులోని శ్రీ కృష్ణవేణి చిల్లీస్ దిగుమతి షాపు వద్దకు తీసుకురావడంతో ఎర్రగా నిగనిగలాడుతున్న ఆ టాప్ క్వాలిటీ మిరపకాయలను చూసి ఎగుమతిదారులు ఆశ్చర్యపోయారు. దాంతో ఆ మిర్చిన కొనేందుకు చాలా మంది ఆసక్తిచూపారు.మిర్చి క్వింటా ధర రూ. 25 వేల వరకే ఉండేది.. అలాంటిది క్వాలిటీ మిర్చికి తోడు పోటీ కూడా పెరగడంతో రికార్డు స్థాయిలో రూ. 32 వేల వరకు వేలం వెళ్లింది. అయితే, రూ. 40 వేలకు అమ్మాలన్న ఉద్దేశంలో రైతు అమర్‌నాథ్ ఉన్నాడు. దాంతో వంద టిక్కీల మిర్చి యార్డులోనే ఉంది. తాను అనుకున్న ధర వచ్చిన తర్వాతే విక్రయించాలని రైతు ఉన్నాడు. పంటకు తెగులు సోకినా తగిన సంరక్షణ చర్యలు తీసుకుని క్వాలిటీ ఏ మాత్రం దెబ్బతినకుండా సాగు చేశాడని.. అందుకే ఈ స్థాయిలో మిర్చి రికార్డు ధర పలికింది అంటూ గుంటూరు ఏఎంసీ వర్గాలు అంటున్నాయి.

### ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్ రిపోర్టులో
# వెలుగులోకి కీలక అంశాలు



**హైదరాబాద్, జులై 30 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన కృష్ణారెడ్డి ప్రస్తుతం చంచల్‌గూడా జైల్లో ఉన్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముందుగా ఇద్దరికీ పరిచయం ఏర్పడిందని.. ఆ తర్వాత జాతీయ పోలీస్ అకాడమీలో వారు దగ్గరయ్యారని పోలీసులు తెలిపారు. ఉదయ్ జీవిత చరిత్ర చూసి ట్రైనీ ఐపీఎస్ అధికారిని పరిచయం పెంచుకున్నారని వెల్లడించారు.

**ఐపీఎస్ అధికారినిపై ఉదయ్ కృష్ణారెడ్డి దాడి చేశాడు..**

మహిళా ట్రైనీ ఐపీఎస్, ఉదయ్ కృష్ణారెడ్డి మధ్య చాలాకాలం పాటు సంబంధాలు కొనసాగాయని పోలీసులు రిమాండ్ రిపోర్టులో చెప్పుకొచ్చారు. కొన్ని రోజుల తర్వాత వీరి మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. ఇతరులతో మాట్లాడితే లేడీ అధికారిని ఉదయ్ విపరీతంగా వేధించేవారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ట్రైనీ ఐపీఎస్ అధికారినిపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ పోలీస్ అకాడమీలో వీరు విడిపోయారని వెల్లడించారు. ముస్సోరీలో జరిగిన ట్రైనింగ్‌లో మళ్లీ మహిళా ట్రైనీ ఐపీఎస్, ఉదయ్ కృష్ణారెడ్డి కలుసుకున్నారని పోలీసులు తెలిపారు.

**అనుమానంతో వేధించేవాడు..**

అప్పటినుంచి వీరి మధ్య సంబంధాలు కొనసాగాయని పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా తర్వాత మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను ఉదయ్ కృష్ణారెడ్డి తరచూ అనుమానంతో వేధించేవాడని చెప్పారు. ఉదయ్ కృష్ణారెడ్డి తీరుతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయని వెల్లడించారు. మళ్లీ ఎమోషనల్‌గా ఆమెకు దగ్గరయ్యారని అన్నారు. ఐదుసార్లు మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను కొట్టాడని పోలీసులు చెప్పారు. ఆ తర్వాత కూడా అతని తీరు మారలేదని.. అనంతరం వారిద్దరి మధ్య మళ్లీ విభేదాలు వచ్చాయని తెలిపారు. నేషనల్ పోలీస్ అకాడమీలో అధికారులకు ఇంటర్నల్‌గా మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారని పోలీసులు వెల్లడించారు.

**మరికొంత మంది అమ్మాయిలతో ఉదయ్ కృష్ణారెడ్డి చాటింగ్..**

మహిళా ట్రైనీ ఐపీఎస్‌కు మే నెలలో వివాహం జరిగిందని పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. ఆ వివాహం తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డి నుంచి మరింతగా ఆమెకు వేధింపులు పెరిగాయని చెప్పుకొచ్చారు. దీంతో మహిళా ట్రైనీ ఐపీఎస్ తన భర్త సహకారంతో హైదరాబాద్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ క్రమంలోనే మరికొంత మంది అమ్మాయిలతో ఉదయ్ కృష్ణారెడ్డి చాటింగ్ చేసినట్లుగా గుర్తించామని చెప్పారు. చాలామంది యువతులను ఉదయ్ వేధించారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తన స్వగ్రామంలో కూడా కొంతమంది అమ్మాయిలను ఉదయ్ వేధించారని వెల్లడించారు. పోలీస్ అకాడమీలో ఉన్న ట్రైనింగ్‌లో మహిళా ఐపీఎస్ అధికారులను కూడా ఉదయ్ కృష్ణారెడ్డి వేధించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో

# వైభవంగా వరుణయాగం ప్రారంభం

### సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష

**వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరుణయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా






కలెక్టర్, ఎస్పీ కు అందజేశారు. అనంతరం గౌరవ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆలయ అర్చకులు, వేద పండితులకు వరుణ యాగం ప్రారంభం సందర్భంగా వర్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ. వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి,జిల్లా అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలాశయాలకు

# పోటెత్తుతున్న వరద...

**తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు**

**ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు**

**జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

**వివిధ జలాశయాల ప్రస్తుత పరిస్థితి వివరాలు:**

జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్):ఇన్‌ఫ్లో: 91,000 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 81,695 క్యూసెక్కులు (10 గేట్లు ఎత్తివేత).

నీటిమట్టం: గరిష్ఠంగా 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం 317.35 మీటర్లకు చేరింది.

నీటి నిల్వ: పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.371 టీఎంసీలు నమోదైంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

**భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి:**

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27.4 అడుగులకు చేరడంతో తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

**శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):**

**ఇన్‌ఫ్లో: 6,250 క్యూసెక్కులు.**

నీటిమట్టం: పూర్తిస్థాయి 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065 అడుగులు ఉనంది. 80 టీఎంసీల సామర్థ్యానికి గాను 16 టీఎంసీల నిల్వ ఉంది.

**నిజాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):**

**ఇన్‌ఫ్లో: 3,935 క్యూసెక్కులు**



**నీటిమట్టం**: పూర్తిస్థాయి 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1395.83 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 7.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది (గత ఏడాది ఇదే సమయానికి 4.622 టీఎంసీలుగా ఉంది).

**సింగూరు ప్రాజెక్టు (సంగారెడ్డి):**

ఇన్‌ఫ్లో: 517 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 470 క్యూసెక్కులు. నీటి నిల్వ: 29.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 4.249 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది.

## తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

# వేలాదిగా పేరుకుపోయిన దరఖాస్తులు

**తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు**

**రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం**

**రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా దరఖాస్తులు**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

**సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే**

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం 'తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్'ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళు _ంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకోడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

## ప్రధాని, హోంమంత్రి

# మౌనం వీడాలి..

- **మొదటి పేజీ తరువాయి**

తప్పించుకోలేరన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్‌కు ప్రభుత్వం కారణం వెల్లడించాలన్నారు. లాఠీఛార్జ్‌కు కోసం ఎవరు ఆదేశించారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్పీఎఫ్.. కేంద్ర హోంశాఖ పరిధిలోకి వస్తాయన్నారు. హోంశాఖ అప్రూవల్ లేకుండా ఇదంతా జరగదన్నారు. పోలీసుల చర్యలపై అమిత్ షా స్టేట్మెంట్ ఇవ్వాలని ఖర్గే డిమాండ్ చేశారు. బీజేపీ రాకీయాల వల్లే దేశంలో లీకులు, నిరసనలు, లాఠీఛార్జ్‌లు జరుగుతున్నట్లు ఆరోపించారు. చిల్లర రాజకీయాల్లో జోక్యం చేసుకోకుంటే ఇవన్నీ జరిగేవి కావు అని ఖర్గే అన్నారు. నిరసనకారులకు జరిగిన ప్రతి గాయానికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. పేపర్ లీకేజీ నిరోధక బిల్లును గతంలో ఎందుకు ప్రవేశపెట్టలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర సర్కారు రాజకీయాల్లో నిమగ్నమైందని, కానీ పిల్లల భవిష్యత్తును విస్మరించిందన్నారు. నిరసనలను నియంత్రించేందుకు బిల్లు తెచ్చారు, కానీ విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత సమయం ప్రకారం నిర్వహించే వార్షిక పరీక్షల క్యాలెండర్‌ను రిలీజ్ చేయాలని కోరారు. విద్యా సంస్థలకు ఆర్ఎస్ఎస్ వ్యక్తులు నేతృత్వం వహిస్తున్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలను ట్రెజరీ సభ్యులు ఖండించారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొన్నది. మనుస్మృతిపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ రికార్డుల నుంచి తొలగించాలని సభాపక్ష నేత జేపీ నడ్డా కోరారు. ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు.

## మోదీ రాజీనామా లేఖ వైరల్..

- **మొదటి పేజీ తరువాయి**

ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## 21 ఏళ్ల లిమిట్ పై పెరుగుతున్న మద్దతు...

- **మొదటి పేజీ తరువాయి**

లభించడం విశేషం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, రేవంత్ రెడ్డి ఆలోచనను బహిరంగంగా ఆహ్వానించారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్న ప్రతి యువకుడికీ రాజ్యాంగం, సమాజంలో మార్పులు, ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే చైతన్యం ఉన్న 21 ఏళ్ల యువతకు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఇప్పటికే పలు అభివృద్ధి చెందిన దేశాలు 21 ఏళ్లకే పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్న విషయాన్ని కూడా నేతలు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ప్రతిపాదనకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో భాగంగా, త్వరలోనే 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా దీనిపై చర్చించి ఒక ఉమ్మడి నిర్ణయానికి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 79 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన మనం, రాజ్యాంగపరంగా 21 ఏళ్లకు చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదనే ప్రశ్నకు ఇప్పుడు బలం చేకూరుతోంది. అయితే, కేవలం డిజిటల్ చైతన్యం సరిపోతుందా లేదా రాజకీయ పరిణతి అనుభవంతోనే వస్తుందా అనే కోణంలో రాజ్యాంగ నిపుణులు, పార్లమెంటేరియన్లు ఈ అంశాన్ని ఎంతవరకు సీరియస్‌గా తీసుకుంటారో వేచి చూడాలి. ఏది ఏమైనా, 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు వయోపరిమితిని తగ్గించాలనే ఈ డిమాండ్ రాబోయే రోజుల్లో భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## '2034 వరకు నేనే సీఎం'..

**మొదటి పేజీ తరువాయి**

బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## వందేమాతరం బిల్లుకు పార్లమెంటు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

## తెలంగాణలో భారీ వర్షాలు

**మొదటి పేజీ తరువాయి**

డెడ్స్టోరేజ్లో ఉన్న కడెం ప్రాజెక్టు ఇప్పుడు భారీ వరదతో నిండుకుండలా మారుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఇటు కృష్ణా బేసిన్లోనూ ప్రాజెక్టులకు వరద వస్తున్నది. తాజా వర్షాలతో ఇన్నాళ్లూ లోటులో ఉన్న వర్షపాతం సాధారణ స్థాయికి చేరుకుంటున్నది. భారీ వర్షాలకు బెల్లంపల్లి, రామగుండం రీజియన్లలోని ఓపెన్కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, ఓవర్బర్డెన్(మట్టి) వెలికితీత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎడతెగని వానలతో క్వారీల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ, ఇందారం ఓసీపీలు, మందమర్రి ఏరియాలోని కల్యాణిఖని ఓసీపీ, బెల్లంపల్లి ఏరియాలోని ఖైరీగూరా ఓసీపీల్లో సుమారు 30 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దాదాపు 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(మట్టి) వెలికితీతకు అంతరాయం ఏర్పడింది.

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

**టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు**

**ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం**

**ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు**

**బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం**

**మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా, తర్వాత ఇతర నగరాలకు విస్తరణ**

**ప్రైవేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక**




తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి.ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఉప్పల్ లో 60 కోట్ల నిధులతో శంకుస్థాపనలు చేసిన మంత్రి శ్రీధర్ బాబు

**మేడ్చల్:**ఉప్పల్, రామంతాపూర్, చిల్కానగర్ లలో అరవై కోట్ల ప్రభుత్వ నిధులతో.. హనుమాన్ వ్యాయమశాల, ఉప్పల్ బస్సు స్టేషన్ ఆధునికరణ.. రోడ్ల అభివృద్ధి కి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసారు.మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో మెట్రో సెకండ్ ఫేస్ చేయలేదని, కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోవడం బాధాకరం. నగర ప్రజలు ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయని అన్నారు. మెట్రో పేస్ 2 కోసం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం నగర ప్రజలకు స్వచ్ఛమైనగాలి, నీరు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి ప్రక్షాళన చేపట్టారని అన్నారు. మొట్టమొదటిసారిగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పదివేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి నగర అభివృద్ధికి పాటుపడుతున్నామని అన్నారు.

## మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 30** : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. ఈరోజు (గురువారం) ఎంసీహెచ్ఆర్డీలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్..**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెలకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## మహిళల స్వీరరక్షణకు మార్షల్ ఆర్ట్స్

**హైదరాబాద్:**మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవటం వల్ల మహిళల స్వీయ రక్షణకు తోడ్పాటు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు. ఈ రోజు కూకట్పల్లి వివేకానంద నగర్ లోని టైకా మార్షియల్ ఆర్ట్స్ అకాడమీలో సెప్టెంబర్ 5వ ,6వ తేదీలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 కి సంబంధించి బ్రోచర్ తో పాటు కప్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ ... ఈ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలో దేశం నుండి 10 రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొంటున్నారని అన్నారు. ఆగస్టు 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 5,6 వ తేదీన నిర్వహించబోయే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్ కుమార్, సినీ నటుడు డాక్టర్ సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మెడల్స్ అందజేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అశోక్ చక్రవర్తి వెల్లడించారు

## ఢిల్లీలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటికి టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధులు

న్యూ ఢిల్లీలోని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటికి గురువారం టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధుల బృందం రాగానే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సాధర స్వాగతం పలికి ఆహ్వానించారు. టిబెటన్ పార్లమెంట్ ఉపసభాపతి ఖెన్పో సోనం టెన్‌ఫెల్, పార్లమెంట్ సభ్యులు చోడాక్ గ్యాట్సో, గ్యాల్ట్సెన్ చోఎక్యి లు ఢిల్లీలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నివాసానికి విచ్చేసి ఇరు దేశాల మధ్య పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా టిబెటన్ ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, పరస్పర ఆసక్తి కలిగిన విషయాలపై అభిప్రాయాలను పంచుకున్నామని, టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను తగిన వేదిక ద్వారా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు.

# భారీగా పెరిగిన బియ్యం ధరలు

**హైదరాబాద్, జూలై 30:**తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ.52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ.10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.54 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న రోజుల్లో బియ్యం ధరలు అకస్మాత్తుగా



ఎగబాకే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హెచ్చరించింది. ప్రస్తుతానికి మార్కెట్‌లో ధాన్యపు నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో ఏర్పడే వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బియ్యం వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని తాజా పాలసీ పత్రంలో స్పష్టం చేశారు. సెంటర్ ఫౌండింగ్ డైరెక్టర్ సమరేందు మొహంతి, పీజేటీఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఆసియాలోని ప్రధాన వరి సాగు ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం పడితే, దిగుమతి చేసుకునే దేశాలు ముందుగానే నిల్వలు పెంచుకోవడానికి మొగ్గు చూపుతాయి.దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు యావరేజ్‌గా 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది. ఉత్పత్తి స్థిరంగా ఉండి, ప్రభుత్వాలు ఎగుమతి ఆంక్షలు విధించకపోతే, ఆందోళన కొనుగోళ్లు లేకపోతే ధరలు కేవలం 10 నుంచి 20 శాతం వరకు మాత్రమే పెరుగుతాయన్నారు. మధ్యస్థ ఉత్పత్తి నష్టాలు, ఆగ్నేయాసియా దేశాలు ముందు జాగ్రత్త చర్యగా నిల్వలు పెంచుకోవడం వల్ల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ఎగిసే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన ఉత్పత్తి నష్టాలు, విస్తృతమైన ఎగుమతి నిషేధాలు, పానిక్ బైయింగ్ చోటు చేసుకుంటే మాత్రం గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రపంచ బియ్యం మార్కెట్‌ను స్థిరీకరించడంలో భారత్ పాత్ర అత్యంత కీలమని అధ్యయనం స్పష్టం చేసింది. ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆహార ధాన్యాల నిల్వల్లో భారత్ అగ్రగామిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే, దేశీయ అవసరాలరీత్యా భారత్ మళ్లీ ఎగుమతులపై ఆంక్షలు విధిస్తే.. అది అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలను మరింత వేగవంతం చేస్తుందని హెచ్చరించారు.ఎలాంటి సంక్షోభాలనైనా ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం, పారదర్శకమైన వాణిజ్య విధానాలు, ఎప్పటికప్పుడు సరైన మార్కెట్ సమాచారం అందుబాటులో ఉండటం చాలా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో ఇప్పుడు బియ్యం ధరలు కూడా పెరిగితే సామాన్యుల జీవనం కష్టతరమవుతుందని అంటున్నారు. ఇలా అయితే జీవించటం కష్టమేనని అంటున్నారు.పంట ఉత్పత్తి సాధారణంగా ఉండి, భారీ కొనుగోళ్లు జరగకపోతే ధరలు 10-20 శాతం వరకు మాత్రమే పెరగొచ్చని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు ఉన్న పరిస్థితిలో.. మోస్తరు దిగుబడి తగ్గుదల, నిల్వల పెరుగుదల కారణంగా ధరలు 30-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ఎగుమతి ఆంక్షలు, భయంతో భారీ కొనుగోళ్లు జరిగితే ప్రపంచ బియ్యం ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న ఖరీఫ్ పంట ఆశించిన స్థాయిలో వస్తే బియ్యం ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కొనసాగడం, నిల్వలు పెరగడం వంటి అంశాలు కొనసాగితే వినియోగదారులపై ధరల భారం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తెరపైకి ఎండ్రిన్ పార్టీ....

**హైదరాబాద్, జూలై 30:**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ నిరుద్యోగ యువతను తట్టిలేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, రాజకీయ హామీల ఉల్లంఘనకు నిరసనగా తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, పోలీస్ జేఏసీ నేతలు ఏకమై 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' పేరుతో కొత్త రాజకీయ వేదికను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యల సమగ్ర పరిష్కారమే అజెండాగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం, ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.ఈ సంచలనాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన కారణమని నిరుద్యోగ నాయకులు స్పష్టం చేశారు. "మీరు ఒర్లినా, పొర్లుదండాలు పెట్టినా.. ఎండ్రిన్ తాగి బావిలో దూకినా పోలీస్ ఉద్యోగాలు పెంచడం సాధ్యం కాదు" అంటూ సీఎం చేసిన కామెంట్స్ నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి. దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువత ఆవేదనను ఎద్దేవా చేసేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు నిరసనగానే, ఆ పదాలనే ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రంగా మలచి 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ'కి పురుడుపోశారు. ప్రజాస్వామ్యయుతంగా తమ గొంతును చట్టసభలు, రాజకీయ వేదికలపై వినిపించడమే ఈ నూతన వేదిక లక్ష్యమని ప్రతినిధులు వెల్లడించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను కూడా పెట్టారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిర్దేశిత గడువులోగా నియామక




ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన యువత కోసం 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను నింపాలన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్ -3, గ్రూప్-4 నియామక ప్రక్రియను ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా పారదర్శకంగా వేగవంతం చేయాని డిమాండ్ చేశారు.పార్టీ నమోదు ప్రక్రియను వారం రోజుల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద పూర్తి చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేటలో భారీ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విప్లవ పోరాటాల ప్రతీక మారోజు వీరన్న స్థూపం వద్ద తెలంగాణ ఎండ్రిన్ పార్టీ అధికారిక లోగోను ఆవిష్కరించి తొలి బహిరంగ సభ ద్వారా తమ బలాన్ని చాటుకోనున్నారు.ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన రాజకీయం మరొకటి ఉంది. జాతీయ స్థాయిలో వెలిసిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా పూర్తి మద్దతు పలికారు. యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టేలా వయోపరిమితిని సడలించాలని కాంగ్రెస్ గళమెత్తి సర్వత్రా ప్రశంసలు అందుకుంది. కానీ, సొంత రాష్ట్రంలో గత 50 రోజులుగా నిరుద్యోగులు రోడ్డెక్కి పోరాడుతున్నా, వారి సమస్యలను పట్టించుకోకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య హక్కులు మాట్లాడే కాంగ్రెస్, స్థానికంగా నిరుద్యోగుల ఆవేదనను తృణీకరించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శిస్తున్నారుకాక్రోచ్ జనతా పార్టీ బాటలోనే 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' ఆవిర్భవించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఊహించని పెద్ద రాజకీయ తలనొప్పిగా మారింది. నిరుద్యోగుల తిరుగుబాటు కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఎన్నికల క్షేత్రంలో ఓటు బ్యాంకును శాసించే స్థాయికి చేరితే అది అధికార కాంగ్రెస్‌కు సవాలుగా మారడం ఖాయం. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం మొండివైఖరి వీడి నిరుద్యోగుల సమగ్ర డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో ఈ 'ఎండ్రిన్' ఉద్యమ సెగలు రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

## తొట్టెల బుట్టలకు ఫుల్ డిమాండ్

**హైదరాబాద్, జూలై 30:**బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఈ పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో ముఖ్యమైన ఘట్టం. అయితే, ఈ ఉత్సవాల్లో తొట్టెల సమర్పణ కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. భక్తులు తమ మొక్కులు నెరవేరాలని, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా, భక్తుల అభిరుచి మరియు మొక్కుల ప్రకారం, తొట్టెల పరిమాణం మారుతుంది. కొందరు చిన్న తొట్టెలను సమర్పిస్తుంటే, మరికొందరు భారీ, ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలను సమర్పించడం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి సంబంధించిన కళ, కార్వాన్, పురానాపూల్ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారింది. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయ వృత్తిని నమ్ముకుని నేటికీ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తొట్టెలను వెదురు, రంగురంగుల కాగితాలు, అలంకరణ సామగ్రితో చేతిపనిగా రూపొందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది, భక్తుల నుంచి ఈ తొట్టెలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ కారణంగా, తొట్టెల ధరలు కూడా విభిన్నంగా ఉంటాయి. సాధారణ తొట్టెల ధరలు రూ.500 నుంచి ప్రారంభమవుతుండగా, భారీ బహుళ అంతస్తుల తొట్టెల ధరలు రూ.2 లక్షల వరకు చేరుకుంటున్నాయి. ఈ ధరలు, తయారీకి ఉపయోగించే సామగ్రి, అలంకరణ మరియు పరిమాణం ఆధారంగా మారుతుంటాయి.బోనాల ఉత్సవాల్లో తొట్టెల తయారీకి సంబంధించిన ఈ కళ, కేవలం ఆర్థిక వనరులే కాకుండా, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి, యువతను ప్రోత్సహించడం, ఈ కళను నేర్పించడం అత్యంత అవసరం. ఈ విధంగా, భవిష్యత్తులో కూడా ఈ కళను కొనసాగించడానికి వీలు కల్పించవచ్చు. బోనాల ఉత్సవాలు,



తెలంగాణ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, ఈ ఉత్సవాల్లో తొట్టెల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, మన సంప్రదాయాలను మరింత బలపరిచే అవకాశం ఉంది.ఈ ఉత్సవాల్లో, తొట్టెల తయారీకి సంబంధించిన కుటుంబాలు, తమ కళను ప్రదర్శించడానికి, తమ ఉత్పత్తులను విక్రయించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాయి. ఈ సమయంలో, భక్తులు తమ ఇష్టానికి అనుగుణంగా తొట్టెలను ఎంచుకుంటారు. ఈ విధంగా, బోనాల ఉత్సవాలు, కేవలం ఆధ్యాత్మిక పండుగ మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ ఉత్సవాలు, తెలంగాణలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా, మన సంప్రదాయాలను, కళలను, మరియు సంస్కృతిని పునరుద్ధరించడానికి, ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

## మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

**మొత్తం 85 గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల**



**హైదరాబాద్:**మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి పెరగడంతో అధికారులు 85 గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో – 1,01,530 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో – 1,01,530 క్యూసెక్కులు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఒకే స్థాయిలో నమోదు కావడం విశేషం.

### ఉగ్రరూపం దాల్చిన మూల వాగు

**రాజన్న సిరిసిల్ల:**కోనరావుపేట మండలంలోమూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు మూల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగు నీటి ఉధృతికి మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మధ్య ఉన్న రహదారి పూర్తిగా తెగిపోయింది. రహదారి కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాల నడుమ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వాగుపై వెంటనే వంతెన నిర్మించాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కాగా, తెగిపోయిన రహదారి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ను అడ్డుగా ఉంచి ప్రయాణికులను హెచ్చరిస్తున్నారు.

# లోక్‌సభలో ప్రతిపక్ష నాయకత్వ హోదాకే అవమానంగా రాహుల్ ప్రసంగం

హైదరాబాద్ జులై 30;"లోకల్ సభలో ఏం మాట్లాడాలో, అత్యున్నతమైన లోక్ సభలో ఏం మాట్లాడాలో కనీస అవగాహన, జ్ఞానం కూడా లేనటువంటి వ్యక్తి ఈ దేశానికి ప్రతిపక్ష నాయకుడా అని భారతీయులంతా ముక్కు మీద వేలేసుకుని తలదించుకునేలా రాహుల్ గాంధ?యవహరించారని బిజెపి సీనియర్ నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే శ్ ఎన్.వి.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ పల్నాటి వెంకట్ రెడ్డి గారితో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.సభా గౌరవాన్ని మంటగలిపేలా రాహుల్ గాంధీ నిన్న లోక్‌సభలో మాట్లాడిన పదాలు, అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు ఆయన అపరిపక్వతకు నిదర్శనమని ప్రభాకర్ గారు మండిపడ్డారు. గతంలో పార్లమెంట్‌లో కనుసైగలు చేయడం, ఫ్లయింగ్ కిస్‌లు ఇవ్వడం, చిలిపి చేష్టలు చేయడం రాహుల్‌కు అలవాటుగా మారిందని, ఆయన మానసిక స్థితి సరిగ్గా లేకే "సభను ఆర్డర్‌లో పెట్టు" అంటూ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన ప్రసంగంలో పాయింట్ లేకపోగా, దేశ ప్రజలను తీవ్రంగా డిసపాయింట్ చేశారని విమర్శించారు.గతంలో కోర్టుకు లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పి ఒక కేసులో బయటపడిన రాహుల్ గాంధీ,



మరో పరువు నష్టం కేసులో సీటును కూడా కోల్పోయి, స్టేపై తాత్కాలికంగా కొనసాగుతున్నారని గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ ఆర్థిక కుంభకోణంలో తల్లి, కొడుకు ఇద్దరూ బెయిల్‌పై బయట తిరుగుతూ నీతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బెయిల్ రద్దయితే రాహుల్ గాంధీ పోవాల్సింది జైలుకేనని స్పష్టం చేశారు.యువతకు ప్రతీక అని చెప్పుకునే రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కాంగ్రెస్ చేసిన జాప్యం వల్ల 1,200 మంది అమాయక విద్యార్థులు, యువకులు ఆత్మబలిదానాలు చేసుకోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఎన్నికల్లో జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను మోసగించిన నెంబర్ వన్ దగాకోరు రాహుల్ గాంధీ అని నిలదీశారు. కర్ణాటకలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, గతంలో కాంగ్రెస్ హయాంలో సీబీఎస్ఈ, జేఈఈ, ఎయిమ్స్ పేపర్ల లీకేజీలతో కాంగ్రెస్ నాయకులు 'లీక్ వీరులు'గా మిగిలిపోయారని విమర్శించారు.రాహుల్ గాంధీ పౌరసత్వంపై బ్రిటన్ సిటిజన్ షిప్ వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, దేశ సమగ్రత, సైన్యం ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా విదేశీ గడ్డపై చిల్లర మాటలు మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. అసలు దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ విదేశాలకు ఎందుకు పారిపోతారని ప్రశ్నించారు. ఇప్పటివరకు 207 సార్లు ఒకే విదేశీ ప్రాంతానికి వెళ్లి, అక్కడి మహిళలతో, పిల్లలతో విహారయాత్రలు, నౌకాయానాలు చేయడం వెనుక రహస్యమేంటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంలో ఇలాంటి పనులు చేసేవారిని 'ఇడియట్' అంటారని, ప్రధాని మరియు హోంమంత్రి పట్ల దురుసుగా ప్రవర్తించిన రాహుల్ గాంధీకి రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

# ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ వేగవంతంగా పూర్తి చేయాలి..

**పొరపాటు లేకుండా నమోదు చేయాలి**

**నాగర్ కర్నూల్ జులై 30 (స్కై న్యూస్)** ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు గురువారం మునిసిపాలిటీ పరిధిలోని 116వ పోలింగ్ బూత్ లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ తో కలసి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిబంధనలు కనుగుణంగా నిర్వహించాలని అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలను జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటర్ కూడా తమ ఓటు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచించారు అనంతరం బూత్ లెవెల్ అధికారితో డిజిటలైజేషన్ వివరాలను తెలుసుకున్నారు రెండు రోజుల్లో పూర్తి ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయనకు



అధికారి హామీ ఇచ్చారు అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2 లక్షల 40 వేల 571 మంది ఓటర్లు ఉన్నారని వీరిలో 2 లక్షల39 వేల571 మంది వివరాలను డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని ఆర్డిఓ కలెక్టర్కు వివరించారు తాడూర్ మరియు నాగర్ కర్నూల్ రూరల్ మండలాలలో 100% పూర్తి చేసినట్లు



తెలిపారు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల వివరాల నమోదులో నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అర్చన మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి తహసీల్దార్ తబితా రాణి కౌన్సిలర్ ఆవంచ మాధవి రాజు డిటి కిరణ్ కుమార్ తో పాటు అధికారులు పాల్గొన్నారు

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌పై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్



**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ అంశంపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (చీజూజ) స్పందించింది. గ్రామానికి చెందిన పట్నం సురేష్ ఫిర్యాదుపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి, పూర్తి విచారణ చేపట్టి 15 రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ూా=) సమర్పించాలని ఆదేశించింది. డంపింగ్ యార్డ్ వల్ల ఎస్సీ కుటుంబాలు, చిన్న రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో షాద్‌నగర్ బీజేపీ నేతలు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య చొరవ తీసుకున్నట్లు తెలిపారు.

## ఆనాడు మహిళా డిగ్రీ కళాశాల మంజూరు చేయించి ఏర్పాటు చేసిన ఘనత ఎంపీ డి.కె. అరుణమ్మ గారిది....

**మండలానికి జూనియర్ కళాశాల తీసుకువచ్చిన ఘనత డి.కె. అరుణమ్మ గారిది.**

**గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకువచ్చిన నాయకురాలు డి.కె. అరుణమ్మ**

**ఆడపిల్లలు స్థానికంగానే డిగ్రీ చదివే అవకాశం కల్పించారు.**

**జోగులాంబ గద్వాల, జూలై30(స్కై న్యూస్):**రాష్ట్ర బీజేపీ, భారతీయ జనతా యువ మోర్చా పిలుపు మేరకు జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు గద్వాల పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ,ప్రభుత్వ మహిళా డిగ్రీ కళశాల లో నిర్వహించిన "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. **ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ..** ఎన్నికల సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.లిఫీజులు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం, పరీక్షలు రాయడంలో, తదుపరి విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందడంలో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.లివిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో



ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్, కేకే రెడ్డి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,కౌన్సిలర్ శాలన్న, చంద్ర శేఖర్,జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, రాష్ట్ర ఓబీసి మోర్చా అధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యదర్శి మంజుల నరసింహ శెట్టి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పరమేస్వర రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు అక్బర్ పాషా,బిజెవైఎం నాయకులు సాయి,మోహన్ రెడ్డి,ఏబీవీపీ సతీష్ ,సంఘాల పవన్, తదితరులు ఉన్నారు..

# ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో గీజర్లు, ఆర్‌ఓ ప్లాంట్లు, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలి

**ఎస్సీ, బీసీ,సంక్షేమ హాస్టళ్ల జిల్లా అధికారిల కు వినతిపత్రం అందజేసిన, పీవైఎల్, జిల్లా అధ్యక్షులు. బీరెల్లి దానయ్య**

**జోగులాంబ గద్వాల, జూలై30(స్కై న్యూస్);**:జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర మౌలిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గీజర్లు, ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా సంక్షేమ హాస్టళ్ల అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం, చలికాలంలో గీజర్లు లేక విద్యార్థులు చల్లని నీటితో స్నానం చేయాల్సి వస్తోందని, దీంతో జలుబు, జ్వరం, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. అనేక హాస్టళ్లలో ఆర్‌ఓ ప్లాంట్లు లేకపోవడంతో స్వచ్ఛమైన తాగునీరు అందక విద్యార్థులు కలుషిత నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల కడుపు సంబంధిత వ్యాధులు ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. అలాగే పలు హాస్టళ్లలో బాత్రూములు,



మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరా సరిగా లేకపోవడం, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, మంచాలు, పరుపులు వంటి మౌలిక వసతులు తగినంతగా అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెస్‌లో నాణ్యమైన, పోషకాహారం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లాలోని అన్ని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గీజర్లు, ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని పీవైఎల్ డిమాండ్ చేసింది. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీరెల్లి దానయ్య కోరారు.ఈ కార్యక్రమంలో. జమ్మిచెడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

## ధరూర్ సర్పంచ్ డి. ఆర్ విజయ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జూలై30 (స్కై న్యూస్):** గద్వాల పట్టణంలో తన గృహం నందు ధరూర్ సర్పంచ్ డి. ఆర్ విజయ్ నిన్న సాయంత్రం కాలం కాళ్లు జారి కింద పడడంతో చెయ్యికి ఫ్రాక్చర్ అయినది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఈరోజు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సర్పంచ్ డి. ఆర్ విజయ



కుమార్ ఇంటికి వెళ్లి ఆయన ను పరామర్శించి ఆరోగ్యం యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వైద్యులతో మాట్లాడి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు అజయ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవాలి

**యాంకీ లో కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్**

**నారాయణపేట జూలై 30( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా నిలవాలని, ఇక్కడ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా మన అందరం కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక



పిలుపునిచ్చారు. గురువారం నారాయణ పేట జిల్లా నర్వ మండలం(యాస్పరేషన్ బ్లాక్) లోని యాంకీ గ్రామంలో నూతన కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణి తో కలిసి ఆమె ప్రారంభించారు. కేంద్రంలో సరస్వతి మాత చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారని?.అందులో



శ్యామ్ మ్యామ్ చిన్నారులు ఎంత మంది ఉన్నారని అంగన్ వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలనీ, ఒక్క విద్యార్థి కూడా చదువు మానేయకుండా చూడడం మనందరి బాధ్యత అని తెలిపారు. చాలా సంవత్సరాలుగా ప్రారంభించాలని భావించిన ఈ అంగన్‌వాడీ కేంద్రం ఈరోజు ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ తెలిపారు.ఈ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, పరిశుభ్రంగా ఉపయోగించుకోవాలన్నారు. ఇది సాధారణ భవనం కాకుండా కంటైనర్ మోడల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం అని, అందరూ బాధ్యతతో సంరక్షించాలని ఆమె తెలిపారు.గ్రామంలోని మరో ప్రాంతంలో కూడా అంగన్‌వాడీ కేంద్రం అవసరం ఉంటే, తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. నర్వ మండలానికి ఏబీపీ (ూాదీూ) కింద ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని,మండలానికి చెందిన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు,సంబంధిత అధికారులు ఈ మండలంలో ఇంకా ఏయే వినూత్న కార్యక్రమాలు చేపట్టవచ్చో, ఇప్పటికే ఉన్న భవనాలను ఎలా మరింత మెరుగుపరచవచ్చో ఆలోచించి ప్రతిపాదనలు తీసుకురావాలని ఆమె సూచించారు. గ్రామాల అవసరాలను యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త దృష్టికి తీసుకు వస్తే అందుబాటులో ఉన్న నిధుల నుంచి వాటికి ఆమోదం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.నర్వ మండలంలోని సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం నర్వ మండలంలో యాస్పరేషన్ బ్లాక్ కింద అనేక భవనాల నిర్మాణాలకు ఆమోదాలు ఇవ్వడం జరిగిందని, ఎన్ఆర్ఈజీఎస్ **(NREGS)** ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే, బిల్లులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, అధికారులు, సర్పంచ్‌లకు ఆమె సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. దీనివల్ల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అంతకు ముందు డీ డబ్ల్యు ఓ/ డిపివో, డీఆర్డీవో, తహసిల్దార్, ఎంపిడివో, సిడిపివో లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, డీఆర్డీవో/ డిపివో వెంకట్ రాములు, తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, సిడిపివో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహా ట్రేడర్స్

**పెస్టిసైడ్స్ ఊ ఫర్టిలైజర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**జోగులాంబ గద్వాల, జూలై30 (స్కై న్యూస్):** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలో ఆలూరు గ్రామంలో నందు శ్రీ లక్ష్మీనరసింహ ట్రేడర్స్‌లి పెస్టిసైడ్స్ ఊ ఫర్టిలైజర్ ను ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.ఎమ్మెల్యే కి, షాప్ యజమాని నరసింహ



,శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు ఫర్టిలైజర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్ , నాయకులు ఆలూరు రామయ్య శెట్టి , మేస్త్రి తిమ్మప్ప, నారాయణరెడ్డి, నర్సింహులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పార్లమెంట్ లో ఎంపీలు

**జోగులాంబ గద్వాల, జూలై30(స్కై న్యూస్):**పార్లమెంట్ సమావేశాల సందర్భంగా తెలంగాణ బీజేపీ ఎంపీలు అపురూప సన్నివేశం.పార్లమెంట్ ఆవరణలో టీబీజేపీ ఎంపీల ఆత్మీయ సంభాషణతో నవ్వులు విరభూశాయి.చిత్రంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ,బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు,ఎంపీ ఈటెల రాజేందర్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడెం నగేశ్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు.



## జిల్లేడు చౌదర్‌గూడలోనే పోలీస్ స్టేషన్ కొనసాగించాలని జేఏసీ డిమాండ్




**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదర్‌గూడ పోలీస్ స్టేషన్‌ను మండల కేంద్రంలోనే కొనసాగించాలని కోరుతూ జేఏసీ నాయకులు డీఐజీకి వినతిపత్రం సమర్పించారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌ను ఇతర ప్రాంతానికి తరలించవద్దని వారు విజ్ఞప్తి చేశారు. పోలీస్ స్టేషన్ తరలింపు వల్ల ప్రజలకు ఇబ్బందులు, శాంతిభద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని జేఏసీ నాయకులు మచ్చ సుధాకర్ రావు, సయ్యద్ హాఫీజ్, పడకంటి వెంకటేష్ తెలిపారు.

## జిల్లేడు చౌదర్‌గూడలోనే పోలీస్ స్టేషన్ కొనసాగించాలని జేఏసీ డిమాండ్




**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదర్‌గూడ పోలీస్ స్టేషన్‌ను మండల కేంద్రంలోనే కొనసాగించాలని కోరుతూ జేఏసీ నాయకులు డీఐజీకి వినతిపత్రం సమర్పించారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌ను ఇతర ప్రాంతానికి తరలించవద్దని వారు విజ్ఞప్తి చేశారు. పోలీస్ స్టేషన్ తరలింపు వల్ల ప్రజలకు ఇబ్బందులు, శాంతిభద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని జేఏసీ నాయకులు మచ్చ సుధాకర్ రావు, సయ్యద్ హాఫీజ్, పడకంటి వెంకటేష్ తెలిపారు.

## బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఏ లు ప్రతి ఓటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**పాత పాల్వంచలో సర్ ను పరిశీలించిన కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి**




**పాల్వంచ జూలై 30( స్కై న్యూస్):**ప్రతి పోలింగ్ బూత్ లో బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ లు ప్రతి ఓటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాత పాల్వంచ 46వ డివిజన్ పరిధిలోని 77, 78 పోలింగ్ బూత్ లలో ఓటర్ నమోదును కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో కలిసి కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమానికి ఆఖరి గడువు సమీపిస్తున్నందున నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కొత్వాల అన్నారు. అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ లు అప్రమత్తంగా ఉండాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 46వ డివిజన్ సి.పి.ఐ పార్టీ ఇంచార్జ్ రహ్మాన్, బి.ఎల్.ఓ లు చందార్కర్,వరుణ్ బి.ఎల్.ఏ లు షేక్ ఖాజామీయా, మసనం శరత్, డివిజన్ నాయకులు సయ్యద్ కరీం, షేక్ నజీర్ యాటా నాని, బూసి శ్రీను, ధర్మరాజుల రమేష్, కలీమ్ చావా సామ్రాజ్యం, నాని, సాయి, వీరయ్య, రాముఅతదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి జన్మదిన వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్):** నందిగామ మండల కేంద్రంలో నరేష్ కుమార్తె జన్మదిన వేడుకలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి ఆశీర్వదించిన ఆయన, చిన్నారి ఆయురారోగ్యాలతో ఉన్నత విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు జిల్లెల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మహిళా నాయకురాళు రాజ్యలక్ష్మి, విజయమ్మ, సర్పంచ్ జెట్ట కుమార్, గుండు అశోక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 1982 లేఔట్ పత్రాలతో షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు వెడల్పుపై కొత్త చర్చ



**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో 1982 నాటి లేఔట్ పత్రాలు వెలుగులోకి రావడంతో రోడ్డు వెడల్పుపై కొత్త చర్చ మొదలైంది. ఫరూఖ్‌నగర్ గ్రామపంచాయతీ ఆమోదించిన ఎల్‌పీ నెం.306/1982 లేఔట్‌లో అప్పటి ఎన్‌హెచ్-7 (ప్రస్తుతం సంబంధిత రహదారి) వెడల్పు 150 అడుగులు, కాలనీ వైపు 40 అడుగుల రహదారి ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. దీంతో రోడ్డు అసలు వెడల్పు ఎంత? ప్రభుత్వ హద్దులు ఎక్కడివరకు ఉన్నాయి? అనే అంశాలపై అధికారికంగా స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, రోడ్లు-భవనాల శాఖ (=ఒదీ)తో పాటు సంబంధిత అధికారులు పాత లేఔట్లు, ఫీల్డ్ మెజర్‌మెంట్‌లు, ప్రభుత్వ రికార్డులను పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారిక స్పష్టత వస్తే రోడ్డు విస్తరణపై ఉన్న సందేహాలు తొలగడంతో పాటు భవిష్యత్తులో వివాదాలు నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# నాణ్యమైన విద్యను అందించే దీక్షబూనండి

**మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి..**

**ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పని చేయాలి**

**మీ పర్యటన అనుభవాలు విద్యార్థులకు మేలు చేయాలి**

**విదేశీ విద్యకు ఏటా 10-15 మంది ఉపాధ్యాయుల ఎంపిక**

**సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు**

**ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**





**హైదరాబాద్ జులై 30 ;** నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే, నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్లు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్" కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీహెచ్ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, దానిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిలా చూడాలన్నారు. అంత మొత్తం ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలని సూచించారు. వివిధ దేశాల పర్యటనతో ప్రపంచం ఎటు వెళుతుందో తెలుస్తుందని.. పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎకరాల కొద్దీ భూమి, ఇతర ఆస్తులు ఉన్నా సమాజం ఎటు వెళుతుందో తెలియక వెనుకబడి పోతున్నారని, ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మాదిరే ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని సీఎం తెలిపారు. అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడ విద్యార్థులకు పంచాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల సమస్యలపై తనతో కొట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ మండలంలోని పాఠశాలల్లో ఏ వసతులు కావాలి, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు ఏం అవసరమనే అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని సూచించారు. డిసెంబరు నెలాఖరుకు ఆ ప్రణాళిక తమకు అందజేస్తే దానికి అనుగుణంగా తాము కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సీఎం సూచించారు. వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు దీక్షబూనాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని, సమాజం కోసం, తరతరాల భవిష్యత్ ను మార్చేందుకు అయిదేళ్ల పాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని కోరారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులకు మొదటి తేదీనే వేతనాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందజేస్తున్నామని తెలిపారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మానవ సంబంధాలను మెరుగుపర్చే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలు మనలోని మానసిక ఒత్తిడిని దూరం చేస్తారని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు ఉన్న సమాజం, దేశమే అభివృద్ధి చెందుతుందని, మానవ సంబంధాలు లేని దేశాలు అభివృద్ధి పథంలో పయనించవని సీఎం పేర్కొన్నారు. విద్యార్థులు రోజులో అధిక సమయం పాఠశాలల్లోనే ఉంటారని, వారికి మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని సీఎం అన్నారు. విద్య నైపుణ్యం కాదని, విద్యతోపాటు నైపుణ్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ ఒక భాష మాత్రమేనని, భాష సమాచార మార్పిడికి ఉపయోగపడుతుందని, నైపుణ్యం జీవనోపాధి కల్పిస్తుందన్నారు. చైనా, జపాన్, కొరియా, జర్మనీ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే వారు 10 శాతం మించి ఉండరని, కానీ వారికున్న నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారని తెలిపారు.జపాన్, జర్మనీ, కొరియా భాషలు కొంత నేర్చుకొని నైపుణ్యాలు నేర్చుకుంటే అక్కడ మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నిరక్షరాస్యత, కరవుకాటకాలతో దేశం సతమతమవుతున్నప్పుడు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విద్యా, నీటిపారుదల రంగాలను తన ప్రాధాన్యాంశాలుగా ఎంచుకొని ఆ సమస్యలను అధిగమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగు నీటి ప్రాజెక్టులు నెహ్రూ దార్శనికతకు నిదర్శనమన్నారు. నాడు వేసిన పునాదులతో నేడు ప్రతి తండా, గూడెంలోనూ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.సాంకేతిక విప్లవంతో వైట్ కాలర్ జాబ్‌లను మనం అందిపుచ్చుకున్నామని, కానీ ఇప్పుడు ఆ జాబ్‌లకు కాలం చెల్లిందన్నారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో నైపుణ్యాలకు డిమాండ్ ఉన్నందున, అక్కడి అవసరాలకు తగినట్లు నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే సంప్రదాయ కోర్సులతో ప్రభావం కోల్పోయిన ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో ఏటీసీలుగా ఆధునీకరించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉట్నూర్ ఏటీసీలో శిక్షణ పొందిన వారంతా టాటా సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఎం తెలిపారు. కరవు, కాటకాలు, నిరక్షరాస్యతలో కూరుకుపోయిన దేశాన్ని సాగు నీటి ప్రాజెక్టులు, విద్యాలయాల ఏర్పాటుతో సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నెహ్రూపైనా విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. పాకిస్థాన్‌లను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరీబీ హటావో నినాదంతో పని చేసిన ప్రధానమంత్రి ఇందిరా గాంధీపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరి నుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 వరకు 12 ఏళ్లలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.గోరంత పనులను కొండంత చెప్పుకుంటున్నారని, ఎన్నో యుద్ధాలు, కలి,నిరక్షరాస్యతలను అధిగమించిన విజయాలను ఎలా ప్రచారం చేయాలని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సర్వేలు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, తర్వాత కాలంలో అదే నవోదయ విద్యాలయాలకు, గురుకుల పాఠశాలలకు నమూనాగా నిలిచిందన్నారు. ఆ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. సాగు నీటి ప్రాజెక్టులను నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా వర్ణించారని, నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణలో ఈనాడు 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయిందని విమర్శించారు.

ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించడంతో సరిపెట్టుకోకుండా వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనేది తన ఆశయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి వంటి మారుమూల పల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను తెలంగాణలోని 12 వేల పల్లెల్లోని పాఠశాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానని సీఎం అన్నారు.

కొందరు విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని విమర్శిస్తున్నారని, నర్సరీ నుంచి 12 వతరగతి వరకు బ్రేక్ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా? ఐటీఐలను ఏటీసీలుగా మార్చినందుకా? స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అంన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో వాళ్లు తెలపాలని డిమాండ్ చేశారు.ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదని సీఎం అన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలనేదే తన లక్ష్యమన్నారు. సమాజ మార్పునకే తాను విద్యా శాఖ బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి వీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డైరెక్టర్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్పంచులు అధికారులు సమన్వయంతో పని చేయాలి

**ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**



**చిన్న చింతకుంట జులై 30 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో చేస్తూ, ప్రభుత్వ పథకాల సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయంతో పని చేయాలి అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలి అన్నారు.

అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి అన్నారు. రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎంతగానో మెరుగుపరిచింది, తద్వారా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగాయి అన్నారు. ఉపాధి హామీ పథకం కు సంబంధించి, నూతన వి బి-జి రామ్ జి పనులపై అధికారులు సర్పంచ్ లకు అవగాహన కల్పించాలి అన్నారు. సర్పంచ్ లతో చర్చించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలి అన్నారు. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కు ప్రాధాన్యం ఇవ్వాలి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి, రాబోయే సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, మెడిసిన్ (డ్రగ్స్)ను అందుబాటులో పెట్టుకోవాలి అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి, త్వరలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్, ఏ బి స్విచ్లు, పోల్స్ తదితర విద్యుత్ ఉపకరణాలు వస్తున్నాయి, మండలాల వారిగా కార్యక్రమం నిర్వహిస్తాం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి అన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి అన్నారు. పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలి అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి అన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టాలి అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణ పనులను, నిర్ణీత గడువులో పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలి అన్నారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 31 జూలై 2026

# జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, జులై 30(స్పైన్యూస్ ):**జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్ పి .డి జానకి తో కలిసి పాలమూరు యూనివర్సిటీ, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ ప్రతినిధులుతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పోలీసు, ఎక్సైజ్, విద్యాశాఖ తదితర అధికారులతో నిర్వహించిన నార్కోటిక్స్ అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే తెలియ చేయాలని, డ్రగ్స్ నిర్మూలన పై ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. . డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, హాస్టళ్లలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పోస్టర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టర్లను తరగతి గదులు, హాస్టల్ ప్రవేశ ద్వారాలు, సమావేశ ప్రాంగణాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, తల్లిదండ్రులు వచ్చే ప్రదేశాలు వంటి విద్యార్థులకు ఎక్కువగా కనిపించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. పోస్టర్ నమూనాను మూడు రోజుల్లో అందజేస్తామని, అన్ని విద్యాసంస్థలు దానికి అనుగుణంగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన లక్షణాలను గుర్తించేలా అధ్యాపకులు, వార్డెన్లు, భద్రతా సిబ్బందికి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. హాస్టళ్లలోకి విద్యార్థులు తీసుకువచ్చే బ్యాగులను అవసరమైతే తనిఖీ చేయాలని, రాత్రి వేళల్లో హాస్టల్ గదుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని






చెప్పారు. మద్యం సేవించడం చాలా సందర్భాల్లో మాదకద్రవ్యాల వినియోగానికి ప్రారంభ దశగా మారుతుందని, అందువల్ల మద్యం వినియోగాన్ని కూడా కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందితే సంబంధిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే డీ–అడిక్షన్ కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే యువతను మళ్లీ సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చన్నారు. డ్రగ్స్ నియంత్రణ అనేది ఒక్క పోలీసు శాఖ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సమాచారం అందించడంలో భాగస్వామి కావాలని కోరారు. జిల్లాను డ్రగ్ ఫ్రీ మహబూబ్‌నగర్‌గా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఊూూ) కార్యదర్శి డి. ఇందిర మాట్లాడుతూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (చీూూూ) అమలు చేస్తున్న డ్రగ్ అవేర్‌నెస్ అండ్ వెల్‌నెస్ నావిగేషన్ పథకం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు విద్యార్థులందరినీ హాజరయ్యేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రగ్స్ వినియోగించినట్లు గుర్తించిన విద్యార్థులపై వెంటనే శిక్షాత్మక చర్యలకే పరిమితం కాకుండా, ముందుగా కౌన్సెలింగ్, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం, అవసరమైతే డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలించడం వంటి పునరావాస చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీసు శాఖతో పాటు లీగల్ సర్వీసెస్ అథారిటీ, పారాలీగల్ వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే యువతను డ్రగ్స్ బారినుంచి కాపాడవచ్చని ఆమె పేర్కొన్నారు.అంతకు ముందు, సమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపల్లు, విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై తరచూ అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయాలను కలెక్టర్లు తెలిపారు. ఈ సమావేశంలో, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, వివిధ కళాశాలల ప్రిన్సిపల్లు, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల ప్రతినిధులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పవిత్రతకు ప్రాధాన్యం!

**విగ్రహాల సేకరణ కు శ్రీకారం**

**ముందుకొచ్చిన సనాతన ట్రస్ట్**

**హైదరాబాద్ జులై 30;**రాష్ట్రవ్యాప్తంగా పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇళ్లలో, దేవాలయాల్లో కాలక్రమేణా శిథిలావస్థకు చేరి పూజకు అనువుగా లేని దేవతా విగ్రహాలను చెత్తలో వేయకుండా గౌరవప్రదంగా సేకరించి శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు ముందుకు వస్తున్నాయి.ఇందులో భాగంగా నాగోల్ ఆనంద్ నగర్ కేంద్రంగా ఉన్న సనాతన సేవా ట్రస్ట్ ఆగస్టు మొదటి వారంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఆనంద్ నగర్ ఇంద్రప్రస్థ కాలనీ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ఇందుకు వేదిక కానుంది. చెట్ల దగ్గర, చెరువులలో పాత దేవతా చిత్రాలను పడేయకుండా సనాతన ట్రస్ట్ కు అందించాలని ట్రస్ట్ చైర్మన్ సునీల్ శనగల ట్రస్టీలు నవీన్ శనగల, ఎల్లా పంతులు చంద్రశేఖర్, కలాం శెట్టి హరిబాబు, మానస శనగల లు కోరారు. అందించిన వారి గోత్ర నామాలతో పండితుల ఆధ్వర్యంలో ఉద్వాసన పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు 9014019752 నెంబర్ కు వాట్సప్



చేయాలనీ ఆయన సూచించారు పూర్తి వివరాలు హిందూ వాయిస్ ఇన్, యూ ట్యూబ్ ఛానల్ .లో చూడాలని వారు కోరారు తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోందని తెలిపారు.హిందూ సంప్రదాయాల ప్రకారం దేవతా విగ్రహాలకు ప్రత్యేక పవిత్రత ఉందని, అవి పాడైనప్పటికీ సాధారణ వస్తువుల మాదిరిగా పారవేయడం సరికాదని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులు తమ ఇళ్లలో ఉన్న పాత విగ్రహాలను స్వచ్ఛందంగా అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.సేకరించిన విగ్రహాలను ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం నదులు, చెరువులు లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవిత్ర కుండాల్లో నిమజ్జనం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. దాంతో ధార్మిక సంప్రదాయాలు పరిరక్షించబడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ తోడ్పాటు అందుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయి. పాత విగ్రహాలను చెత్తకుప్పల్లో, రోడ్ల పక్కన లేదా నీటి వనరుల్లో నిర్లక్ష్యంగా పడేయకుండా సంబంధిత సేకరణ కేంద్రాలకు అప్పగించాలని భక్తులకు పిలుపునిస్తున్నారు.పవిత్రతను కాపాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భక్తుల్లో అవగాహన పెరగడం వల్ల పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.పాత విగ్రహాలను చెత్తలో వేయొద్దని శాస్త్రోక్తంగా అప్పగించండని ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు విజ్ఞప్తి.చేస్తున్నాయి.

## కళ్యాణి మోటార్స్‌లో నూతన బ్రెజ్జా వాహన మోడల్ ఆవిష్కరణ

**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్పై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లోని కళ్యాణి మోటార్స్‌లో నూతన బ్రెజ్జా వాహన మోడల్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వాహనాన్ని ప్రారంభించిన ఆయన, సామాన్యులకు అందుబాటు ధరలో అధిక ప్రయోజనాలు, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు కలిగిన వాహనాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ఆటోమొబైల్ రంగం నాణ్యమైన సేవలు, సరికొత్త సాంకేతికతతో వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సీఐ నర్సయ్య, రాయికల్ శ్రీనివాస్, లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ అశోక్, తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## వర్షాలతో జాగ్రత్త పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్




**పాపన్నపేట. 30 (వార్తతరంగాలు)** ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, మత్తడులు ఉప్పొంగి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.దీంతో ప్రజలు, మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఏడుపాయల కు వెళ్లే భక్తులు, ఘనపురం ప్రాజెక్ట్ వద్ద వరద ఎక్కువగా ఉన్నందువలన మంజీర నదిలో స్నానాలు చేయవద్దని హెచ్చరించారు.
పూరి ఇళ్లలో ఉండేవారు, నాసిరకం గోడల వద్ద, చెట్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని హెచ్చరించారు.రోడ్లపై ప్రవహిస్తున్న వాగులు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి. ఇబ్రహీంకు ఘన సన్మానం

**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్పై న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎండి. ఇబ్రహీంను విట్యాల రవీందర్ గౌడ్, వెంకటేష్ (రాజు), నిర్దవెల్లి డిప్యూటీ సర్పంచ్ ఎండి. ఆమెర్, ఇసాక్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల అభ్యున్నతికి సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఎండి. ఇబ్రహీం మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.



## ఎస్‌టీ హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్, జులై 30(స్పైన్యూస్ ):**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం క్రిస్టియన్‌పల్లిలో ఉన్న ఎస్‌టీ హాస్టల్‌ను సందర్శించి అక్కడి వసతులు, నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడి, వారికి అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై పూర్తి దృష్టి సారించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.హాస్టల్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, హాస్టల్‌లో పరిశుభ్రత, భద్రత, విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టల్ నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.





# గిరిజన చట్టాలు పనిచేయని గిరిజన జిల్లా

**హైడ్రా కొత్తగూడెం వచ్చేది ఎప్పుడో ? అక్రమాలు కూల్చేదెప్పుడో ?**

**కండ్లుండి చూడలేని కన్నెత్తి చూడని చేతగాని మండల జిల్లా అధికారులు**

**ఐటీడీఏ అధికారులైన చర్యలు తీసుకుంటారా ?**

**అక్రమ సెల్లర్ నిర్మాణంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**ప్రజా ప్రతినిధుల కనుసన్నలోనే అక్రమ నిర్మాణాలు**

**జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో జిల్లా డిపిఓ ఒక్కసారైనా చూడరా ?**







**చుంచుపల్లి జూలై 30(స్పై న్యూస్):** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బఫర్ జోన్ లో అక్రమ సెల్లర్ జి ప్లస్ త్రీ నిర్మాణాలు ప్రజా ప్రతినిధులు అధికారుల కనుసన్నల్లో జోరుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.. సర్వేనెంబర్ 51/4 లో ఇంటి నెంబర్ 3-1-236/4 డి టి సి పి ఓ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజనేతరులు బహుళ అంతస్తుల నిర్మాణాలకి ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ సెల్లర్ నిర్మాణం పనులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తు నిర్మాణాలు కొనసాగుతున్నారు. గత రెండు నెలలుగా పలు దినపత్రికలలో ప్రచురిస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకుల అధికారుల అండదండలతో అక్రమ సెల్లార్ నిర్మాణం జోరుగా కొనసాగుతుంది అక్రమ సెల్లర్ నిర్మాణం తో విద్యానగర్ రోడ్లు బురదతో ప్రజలకు వాహనదారులకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంత తతంగం రెండు నెలలుగా జరుగుతున్న అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చాము చర్యలు తీసుకుంటాము తప్ప చేసేదేమీ లేని పరిస్థితి కనిపిస్తుంది. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం నోటీసులు అందజేసిన సందర్భంలో ఏడు రోజులలో వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో ఉంటుంది కానీ ఏ అధికారిని అడిగినా నోటీసులు ఇచ్చామని మాట తప్ప దానిపై చర్యలు తీసుకుంటామన్న నమ్మకం అధికారులకు సైతం లేకపోయింది .పంచాయతీ సెక్రెటరీ చుంచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు పట్టించుకున్న దాఖలాల్ లేదు రోడ్డు మొత్తం ఆక్రమించి పెద్దపెద్ద వాహనాలతో ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకే చోటు ఉందా అని సందేహం వెలివేర్చుతున్న కొత్తగూడెం విద్యానగర్ ప్రజలు. సెల్లార్ నిర్మాణం పక్కనే నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే బ్యాంకు సైతం ఉంది బ్యాంకుకు వచ్చే వాళ్ళు పోయే వాళ్లతో ఆ ఏరియా కిటకిటలాడుతుంది అయినప్పటికీ అవేవీ లెక్కచేయకుండా అక్రమ నిర్మాణదారులు ప్రజాప్రతినిధులు అధికారుల అండదండలతో రోడ్లపై వాహనాలు నిలిపి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు గత రెండు నెలలుగా పునాది మొదలుకొని ఇప్పటివరకు ఎన్నో దినపత్రికలలో ప్రచురిస్తున్నప్పటికీ అవి ఏమి లెక్కచేయకుండా నేనే రాజు నేనే మంత్రి అన్నట్టుగా అక్కడి ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని అక్రమ నిర్మాణాదారులకు అండగా నిలుస్తూ చేతగాని అధికారులు ప్రోత్సహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో జిల్లా డిపిఓ ఒకసారి దృష్టి సారిస్తే తప్ప ఈ అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయవచ్చని గిరిజన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ సెల్లర్ నిర్మాణాలని కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి:బీజేవైఎం

**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్పై న్యూస్):** చేవెళ్లలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఫీజులు బకాయి--బీజేపీ లడాయి" కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ పాల్గొని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కళాశాలలు కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజు భూపాల్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అభినయ్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరుదు కల్యాణికి

# మొండి చేయేనా

**విజయవాడ, జూలై 30:**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ కావడం, దాని చుట్టూ ఇప్పుడు వైసీపీ అంతర్గత రాజకీయాల్లో నడుస్తున్న డ్రామాలు చూస్తుంటే సామాన్య కార్యకర్తలకు ఇదేం మాస్టర్ ప్లాన్ సామీ అని తలపట్టుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మండలి వైస్ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం మండలిలో వైసీపీకి ఇంకా సంఖ్యాబలం ఉంది కాబట్టి, ఆ ఉపసభాపతి పీఠం ఆ పార్టీకే దక్కనుంది. సరిగ్గా ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి మార్క్ అన్‌ప్రిడిక్టబుల్ వ్యూహం మళ్లీ రచ్చకెక్కింది.సాధారణ పొలిటికల్ లాజిక్ ప్రకారం ఆలోచిస్తే.. ప్రస్తుతం పార్టీ ఘోర పరాజయం తర్వాత కోలుకోవడానికి కూటమికి బదులిచ్చే సామాజిక సమీకరణాలు వాడాలి. పోయిన స్థానం ముస్లిం మైనారిటీది కాబట్టి మళ్లీ అదే వర్గానికి ఇస్తే ఆ సామాజిక వర్గానికి మంచి సంకేతం వెళ్తుంది. లేదా, కూటమిని డిఫెండ్ చేయడానికి కాపులకో, లేదంటే గట్టిగా వాయిస్ వినిపించే బిసి వర్గానికి చెందిన వరుదు కల్యాణి లాంటి నాయకురాలికో ఆ అవకాశం ఇవ్వాలి. పొద్దున లేస్తే మైకుల ముందు నిలబడి, కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ పార్టీ జెండా మోస్తున్న వరుదు కల్యాణి లాంటి వారికి ఇస్తే క్యాడర్‌లో కూడా ఒక రకమైన జోష్ వస్తుంది. లేదంటే తమ పక్కా ఓటు బ్యాంక్ అయిన దళితులకో, రెడ్డి సామాజిక వర్గానికో ఇచ్చి సంతృప్తి పరచవచ్చు.కానీ, వైఎస్ జగన్ ఆలోచనలు వేరే స్థాయిలో ఉంటాయి కదా! రాజకీయంలో లాజిక్కులు వెతికేవారికి ఆయన ఎప్పుడూ షాక్‌లే ఇస్తారు. ఏ రాజకీయ లెక్కలకూ అందకుండా, ఈ కీలక పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాధవరావుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారట. టీవీ డిబేట్లలోనో, బయటో పార్టీ కోసం గట్టిగా మాట్లాడలేని, రేపు పొద్దున పార్టీలో ఉంటారో లేదో కూడా గ్యారంటీ లేని నేతకు ఈ చాన్స్ ఇవ్వడం చూసి వైసీపీ సొంత నేతలే జుట్టు పీక్కుంటున్నారు. మాట్లాడేవారికి పదవులు ఉండవు.. పదవులు వచ్చేవారు మాట్లాడరు అనే కొత్త సూత్రాన్ని జగన్ ఇక్కడ అమలు చేస్తున్నారని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.మైకుల ముందు నిలబడి గొంతు చించుకునే వరుదు కల్యాణి లాంటి నేతలకు కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం చేసి, ఏమాత్రం సౌండ్ చేయని నేతలకు పీఠాలు అప్పగించే ఈ జగన్ మార్క్ సర్‌ప్రైజ్ రాజకీయం చూసి ప్రత్యర్థులు నవ్వుకుంటుంటే, సొంత కార్యకర్తలు మాత్రం ఏందో ఈ ఆపరేషన్.. మనకెందుకీ సిట్యుయేషన్ అని నిట్టూరుస్తున్నారు. ప్రజాక్షేత్రంలో ఎలాగూ షాక్‌లు తింటున్నాం, కనీసం పదవుల పంపిణీలోనైనా కాస్త బుర్ర ఉపయోగిస్తే బాగుండు అని వైసీపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నా.. జగన్ రూటే వేరు అని మరోసారి నిరూపితమైంది. ఈ మొత్తం వ్యవహారంలో వరుదు కల్యాణికి ఎందుకు ఇవ్వడం లేదంటే.. ఆమె ఇప్పటికే బాగా మాట్లాడుతూ పేరు తెచ్చుకున్నారు.ఈ పదవి ఇస్తే ఇంకా ఫోకస్ అవుతారు. జగన్మోహన్ రెడ్డికి అది ఇష్టం ఉండదు. ఈ విషయం వైసీపీలో ఉన్న అందిరకీ తెలుసు.

## అగస్టు 9 నుంచి

# సైదాబాద్ లో బోనాలు

**హైదరాబాద్:**భాగ్యనగరం ప్రజలు ఆరాధ్యదై వంగా పూజించే మహంకాళి అమ్మవారి ఉత్స వాలు సైదాబాద్ ప్రాంతంలో ఆగస్ట్ 9న (ఆదివారం) ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బ్రోచర్ ఆవిష్కరించారు శ్రద్ధా బాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 48సంవత్సరాల నుంచి మహంకాళి జాతర జరు పుతూ ఈ సంవత్సరం కూడా వేడుకలు ఘనంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే సైదాబాద్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉన్నది.10న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మవారి. ఘటం ఊరేగింపు,పోతురాజు లా గావు పెట్టి,పలహారబండ్ల ఊరేగింపు,11న మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి ఘట్టాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు ధరించి భక్తి భజన పాటలతో కనువిందు చేసే ఆర్కెస్ట్రా,పోతురాజుల వేషాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. దేశభక్తిని పెంపొందించే భగత్ సింగ్, మహాత్మాగాంధీ,అల్లూరి సీతారామరాజు,శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశ భక్తుల వేషధారణలతో జాతీయ సమైఖ్య తను చాటిచెప్పేలా ప్రదర్శనలు ఇప్పిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రద్దాబాద్ మహంకాళి జాతర అధ్యక్షుడు కె.మల్లేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కడారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ చందర్జీ, ఉపాధ్యక్షులు సహదేవ్ యాదవ్, గౌలీకార్ దినేష్, కోళ్ళ గోపీ, జైల్ సింగ్ కోశాధికారిగ గోలీకార్ పూర్ణచందర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

## మారని ఆ

# 15 మంది..

### మూసధోరణిలోనే తమ్ముళ్లు

**విజయవాడ, జూలై 30:**తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ వ్యూహాలు ఎల్లప్పుడూ అత్యంత పదునుగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి ఆరోపణలు, నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు వంటి వ్యవహారాల్లో పడి ప్రజలకు దూరమవుతున్న దాదాపు 40 మంది ఎమ్మెల్యేలకు ఆయన గట్టి హెచ్చరికలే జారీ చేశారు. బాబు హెచ్చరికలతో ఆ 40 మందిలో దాదాపు 25 మందికి పైగా వెంటనే అలర్ట్ అయి, తమ తీరు మార్చుకుని దారికి వచ్చారు. అయితే, మిగిలిన ఆ 15 మంది మాత్రం ఇంకా పాత ధోరణినే కొనసాగిస్తూ నాయకత్వానికి మింగుడుపడని సవాలుగా మారారు.కానీ, ఈ 'బ్లాక్ లిస్ట్'లో ఉన్న మిగిలిన 15 మంది ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న నూతన వ్యూహం ఇప్పుడు ఏపీ రాజకీయంలో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని నేరుగా సస్పెండ్ చేస్తే.. సామాజిక వర్గాల కార్డులు లేదా సానుభూతి రాజకీయాలు తెరపైకి వస్తాయి. పైగా నియోజకవర్గాల్లో అనవసరంగా రచ్చ జరుగుతుంది. సరిగ్గా ఈ సమయంలో కాగల కార్యాన్ని గాంధర్వులే తీర్చినట్లు .. టీడీపీ వదిలించుకోవాలని భావిస్తున్న ఆ అసంతృప్త నేతలను ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మెల్లగా తమవైపు ఆకర్షించేలా పరిణామాలు జరిగిపోతున్నాయి.ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ సస్పెన్స్ దాగి ఉంది. అసలు ఆ ఎమ్మెల్యేలను వైసీపీనే ఆకర్షిస్తోందా? లేక అధిష్ఠానమే తెలివిగా, వ్యూహాత్మకంగా వారిని ఆ వైపునకు తోలేస్తోందా? అనేది సాధారణ రాజకీయ పరిశీలకులకు కూడా అర్థం కానంత నిశ్శబ్దంగా జరుగుతోంది. నియోజకవర్గాల్లో వారికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గించడం, వినతులు పట్టించుకోకపోవడం ద్వారా.. మీకు ఇక్కడ భవిష్యత్తు లేదు అనే స్పష్టమైన సంకేతాన్ని పార్టీ పంపుతోంది. దీంతో దిక్కుతోచని ఆ నేతలు సహజంగానే తమ రాజకీయ ఉనికి కోసం వైసీపీ లేదా ఇతర మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడుతోంది.ఒకవేళ ఈ ఎమ్మెల్యేలు స్వయంగా టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకుంటే, అది చంద్రబాబుకు రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది.. నియోజకవర్గాల్లో పనిచేయని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల భారం పార్టీపై నుంచి దానంతటదే తొలగిపోతుంది. రెండోది.. రాబోయే ఎన్నికల్లో కొత్త రక్తానికి, కష్టపడే క్యాడర్‌కు టికెట్లు కేటాయించడానికి అధిష్ఠానానికి సంపూర్ణ క్లియరెన్స్ దక్కుతుంది. అనవసర వివాదాలకు తావివ్వకుండా, నేరుగా పోటు పొడవకుండా.. వదిలించుకోవాలనుకున్న వారిని స్వయంగా బయటకు వెళ్లేలా పరిస్థితులు కల్పించడమే చంద్రబాబు మార్క్ రివర్స్ సైకాలజీ అని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడుకుంటూనే, వ్యర్థాలను బయటకు నెట్టేసే ఈ నిశ్శబ్ద వ్యూహం చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.

## హద్దు మీరుతున్న

# మందుబాబుల వీరంగం..

### ప్రభుత్వ పాఠశాలలో ధ్వంసం
### తాళాలు పగులగొట్టి ఫ్యాన్లు, సామగ్రి ధ్వంసం..
### విద్యాశాఖ నిర్లక్ష్యంపై విమర్శలు

**సి.బెళగల్:** మండల పరిధిలోని కొండాపురం గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు సృష్టించిన విధ్వంసం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. గురువారం రాత్రి కొందరు మందుబాబులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి తరగతి గదుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సామగ్రితో పాటు సీలింగ్ ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తరగతి గదుల పరిస్థితిని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ ఘటనతో విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడటంతో పాటు పాఠశాల ఆస్తులకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.స్థానికుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో కొందరు మందుబాబులు తరచూ పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులపై దాడులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) ఆదం భాషకు సమాచారం అందించినట్లు తెలిపారు. పాఠశాల భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలకు కేవలం పది అడుగుల దూరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండటమే ఇలాంటి ఘటనలకు ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. అక్కడ మద్యం సేవించే వ్యక్తులు రాత్రివేళల్లో పాఠశాల పరిసరాల్లోనే తిరుగుతూ విద్యాసంస్థ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలో బెల్ట్ షాపు కొనసాగడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు.పాఠశాలలో భద్రపరిచిన విద్యార్థుల రికార్డులు, ధ్రువపత్రాలకు సంబంధించిన పత్రాలు ధ్వంసమైతే భవిష్యత్తులో విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ, పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా స్పందించి ఘటనపై విచారణ చేపట్టి విధ్వంసానికి పాల్పడిన ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాల సమీపంలో కొనసాగుతున్న బెల్ట్ షాపును తొలగించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తిరుమల తరహాలో

# కర్నూలు దర్శనాలు

**కర్నూలు జూలై 30:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భక్తుల దర్శనాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీశైల దేవస్థానంలో ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులందరితో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ మార్పులను ఖరారు చేశారు.ఈ కీలక సమావేశంలో 45 అంశాలపై సమగ్రంగా చర్చించి.... అందులో 39 కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు. సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తొలగించి, మరింత సులభంగా దర్శనం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు.నూతన రూల్స్ ప్రకారం... ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై ఇచ్చే ప్రోటోకాల్ టికెట్లను వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారానే జారీ చేస్తారు.ఈ ప్రోటోకాల్ దర్శనం కోరుకునే వారు దర్శన సమయానికి కనీసం 48 గంటల ముందే తమ సిఫార్సు లేఖలను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.ఈ మార్పు ద్వారా భక్తుల రద్దీని సులభంగా నియంత్రించడంతో పాటు, దర్శన వేళల్లో మరింత



పారదర్శకత వస్తుందని పాలకమండలి భావిస్తోంది.ప్రముఖుల సిఫార్సు లేఖల పేరిట జరిగే అక్రమాలను అరికట్టడంతో పాటు, సాధారణ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వేగంగా దర్శనం పొందేందుకు ఈ చర్యలు ఎంతగానో తోడ్పడతాయని ఆలయ ఛైర్మన్ పేర్కొన్నారు.ఇక శ్రీశైలం క్షేత్రాభివృద్ధిలో భాగంగా భక్తుల వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. నూతన క్యూ కాంప్లెక్స్, ఏ-గ్రేడ్ శౌచాలయాలు, స్నానపు గదుల నిర్మాణం, తిరుమల తరహాలో పీఏసీ (పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటును ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల రాకపోకల సౌకర్యార్థం హిందూమాల సత్రం నుంచి కుమార సదనం వరకు.... యోగివేమారెడ్డి సత్రం వెనుక భాగంలో రూ. 24 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించనున్నారు.రాబోయే శ్రావణ మాసంలో భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన గోపురాలకు రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేయనున్నారు. భక్తుల విశ్రాంతి కోసం నందీశ్వర మరియు నీలకంఠేశ్వర డార్మెటరీలలో డక్టబుల్ ఎయిర్ కూలర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే క్యూ కాంప్లెక్సులో అదనపు వాటరు కూలర్లను అమర్చనున్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి.... సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి దేశం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ ఆగమశాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, హోమాలు, జపాలు మరియు పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయి.

# పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీ

**విజయవాడ, జూలై 30:**రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా అందిస్తున్న బియ్యాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించకపోవడానికి గల కారణాలపై పౌర సరఫరాల శాఖ సమగ్ర అధ్యయనం నిర్వహించింది. ప్రతి కిలోపై రూ.56 వరకు రాయితీ ఇస్తున్నప్పటికీ వినియోగం తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ప్రస్తుతం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతేనని గుర్తించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం పెరగడంతో పాటు బియ్యం పక్కదారి పట్టకుండా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని 42 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద స్టీమ్ రైస్‌ను విజయవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ అమలు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రతిపాదించగా సానుకూల స్పందన లభించిందన్నారు.దేశంలోనే తొలిసారిగా కాకినాడ జిల్లాలో పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీకి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో రేషన్ కార్డుదారులు, పాఠశాలలు, హాస్టళ్ల అవసరాల కోసం



నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని అంచనా వేశారు. పైలట్ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణకు అంగీకరించిందని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని చెప్పారు.ఈ త్రైమాసికంలో రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్'లను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్‌సీసీఎఫ్‌తో ఒప్పందం కుదిరిందని, ఈ మార్టుల్లో సుమారు 70 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయని చెప్పారు. ఆగస్టు 1 నుంచి 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక అవుట్‌లెట్లలో బీపీటీ స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, గ్రేడ్-1 రా రైస్‌ను రూ.50కు విక్రయించనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో స్వర్ణ రకం బియ్యాన్ని కూడా రైతు బజార్ల ద్వారా రూ.40కే అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రతి రేషన్ కార్డుదారుడికి 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు.బియ్యం ప్యాకింగ్ నుంచి వినియోగదారుడి వరకు పూర్తి ట్రాకింగ్ కోసం క్యూఆర్ కోడ్‌కు బదులుగా ఆర్‌ఎఫ్‌ఐడీ విధానాన్ని కాకినాడ జిల్లాలో పైలట్‌గా అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే సీబీడీసీ ఆధారిత డిజిటల్ వాలెట్ విధానాన్ని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రజలకు రాయితీ నేరుగా అందడంతో పాటు రేషన్ డీలర్ల కమిషన్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి స్పష్టం చేశారు. .

# కీ రోల్ లో తమ్మినేని వాణి....

**శ్రీకాకుళం జూలై 30:**మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుటుంబం చుట్టూ ప్రస్తుతం చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపి, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ వారసత్వ పత్రాలు సృష్టించి రూ.4 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో తమ్మినేని కుటుంబం ఇరుక్కుపోయింది. ఈ కేసులో హైకోర్టు నుంచి తమ్మినేని సీతారాం, ఆయన భార్య తమ్మినేని వాణిలకు తాత్కాలిక ముందస్తు బెయిల్ లభించినప్పటికీ, కుమారుడు చిరంజీవి నాగ్‌కు మాత్రం బెయిల్ నిరాకరించడంతో సీతారాం తీవ్ర ఇరకాటంలో పడ్డారు. దీనికి తోడు, అమదాలవలస పరిధిలోని ౫= కాలేజీ వెనుక ఉన్న దళిత కుటుంబం భూమిని ఆక్రమించారంటూ వాణిపై తాజాగా మరొక ఫిర్యాదు పోలీసులకు అందిందిఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో తమ్మినేని సీతారాం కేవలం పేరుకే ప్రజాప్రతినిధిగా, స్పీకర్‌గా ఉండేవారని, అసలు డాన్ పాత్ర పోషించింది మాత్రం ఆయన భార్య తమ్మినేని వాణినే అనే టాక్ బలంగా ఉంది. సీతారాం సంపాదించిన రాజకీయ పదవులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వెనుకుండి సెటిల్మెంట్లు, భూ లావాదేవీలు, రాకెట్లు నడిపించడంలో ఆమె ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. కొడుకు చిరంజీవి నాగ్ కూడా పూర్తిగా తల్లి ఆదేశాల మేరకే పనిచేస్తూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల్లో పాత్రదారులుగా మారారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆముదాలవలసలో జరిగిన పలు అక్రమాలు, దందాలు, భూ ఆక్రమణల వెనుక వాణి ముద్రలు ఉన్నాయనే అంశం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తన గుప్పిట్లో ఉంచుకుని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే స్థాయికి ఈ దందాలు సాగాయని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లను సాక్షులుగా పెట్టి, నకిలీ వారసులను సృష్టించి కోట్లాది రూపాయల ఆస్తులను తమ ఖాతాలో వేసుకున్నారనే నిజాలు దర్యాప్తులో వెలుగుచూడటం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. సీతారాం స్పీకర్ హోదాలో ఉండటంతో బాధితులు ఎవరూ బయటకు వచ్చి మాట్లాడటానికి ధైర్యం చేయలేకపోయేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడం, పోలీసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతుండటంతో వాణి సృష్టించిన అక్రమాల చిట్టా అంతా బయటపడుతోంది. ప్రజాప్రతినిధిగా ఉన్న భర్త పవర్‌ను దుర్వినియోగం చేస్తూ ఆముదాలవలసను ఏలిన ఈ షాడో లీడర్ నిజస్వరూపం బయటపడటంతో, తమ్మినేని కుటుంబానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది.

# రాజ్యాంగమే సర్వోన్నతం..

## ప్రభుత్వానికైనా, అధికారులకైనా అంతిమ అధికారం రాజ్యాంగానిదే!



ప్రజాస్వామ్య వ్యవస్థ మూడు ప్రధాన స్తంభాలపై నిలబడి ఉంటుంది. శాసన వ్యవస్థ చట్టాలను రూపొందిస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థ వాటిని అమలు చేస్తుంది. న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని, చట్టాలను పరిరక్షిస్తూ అన్ని వ్యవస్థలు తమ పరిధిలో పని చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పర్యవేక్షిస్తుంది. ఈ మూడు వ్యవస్థలలో ఏ ఒక్కటి కూడా తన పరిధిని దాటి వ్యవహరించినా ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతింటుంది. అందుకే భారత రాజ్యాంగ నిర్మాతలు చట్టబద్ధమైన (రూల్ ఆఫ్ లా) పాలన అనే సూత్రాన్ని ప్రజాస్వామ్యానికి ప్రాణంగా భావించారు. తెలంగాణ హైకోర్టులో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ వ్యవహారానికి సంబంధించిన పరిణామాలు పరిపాలనా వ్యవస్థలో రాజ్యాంగబద్ధ బాధ్యతలపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం, కోర్టు ధిక్కరణ విచారణలను సైతం పట్టించుకోకపోవడం, న్యాయస్థానం వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి వంటి అంశాలు కేవలం ఒక అధికారి వ్యక్తిగత వ్యవహారంగా కాకుండా మొత్తం పరిపాలనా వ్యవస్థ బాధ్యతను ప్రశ్నించే పరిస్థితిని సృష్టించాయి.

భారతదేశంలో ఏ అధికారి అయినా, ఏ ప్రభుత్వం అయినా, ఏ సంస్థ అయినా రాజ్యాంగం కంటే గొప్పది కాదు. ప్రతి ఒక్కరూ ప్రధానంగా గుర్తుంచుకోవలసిన విషయమిది. ప్రభుత్వం జారీ చేసిన ఒక ఉత్తర్వు (జీవో) ద్వారా ఏర్పడిన సంస్థకు చట్టానికి అతీతమైన అధికారాలు లభించవు. జీవో అనేది శాసనసభ చేసిన చట్టానికి లోబడే ఉంటుంది. ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా న్యాయస్థానాల అధికారాలు, చట్టబద్ధమైన శాఖల అధికారాలను పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడితే అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మారుతుంది.

రాజ్యాంగంలోని అధికరణం-141 ప్రకారం సుప్రీంకోర్టు ప్రకటించిన న్యాయసూత్రాలు దేశంలోని అన్ని కోర్టులకు, ప్రభుత్వ అధికారులు కట్టుబడి ఉండాలి. అధికరణం-144 ప్రకారం దేశంలోని ప్రతి సివిల్ సర్వెంట్, న్యాయాధికారి సుప్రీంకోర్టుకు సహకరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఇదే సూత్రం హైకోర్టుల తీర్పుల విషయంలో కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ అధికారి హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి అమలు చేయాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత కలిగి ఉంటారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ఒక ఆదేశం ఇచ్చిన తర్వాత దానిని అమలు చేయాలా వద్దా అనే నిర్ణయం ప్రభుత్వ అధికారికి ఉండదు. తప్పకుండా అమలు చేయడం విధి. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ ఆదేశాలు, పరిపాలనా సౌలభ్యం ఏ కారణంతోనైనా కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తుంది. కోర్టు ధిక్కరణ చట్టం-1971 ప్రకారం కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయకుండా ఉండటం సివిల్ ధిక్కరణగా పరిగణనలోకి వస్తుంది. ఈ చట్టం ఉద్దేశం అధికారులను శిక్షించడం మాత్రమే కాదు, న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం. ఎందుకంటే కోర్టు తీర్పులు అమలుకాకపోతే న్యాయం కేవలం కాగితాలకే పరిమితమవుతుంది.

సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నది. ప్రభుత్వ అధికారులు చట్టానికి అతీతులు కాదని, అధికారంలో ఉన్న వ్యక్తులు కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ఆ అధికారి బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పదేపదే స్పష్టం చేసింది. ప్రభుత్వ యంత్రాంగం కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం రాజ్యాంగ పాలనను బలహీనపరుస్తుందని వ్యాఖ్యానించింది.

సివిల్ సర్వెంట్ అంటే రాజకీయ నాయకుడి ప్రతినిధి కాదు, రాజ్యాంగ ప్రతినిధి. అందుకే ఆల్ ఇండియా సర్వీస్ (కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం ప్రతి అధికారి నిజాయితీ, నిష్పాక్షికత, చట్టబద్ధతతో వ్యవహరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. సేవా నియమాలు అధికారికి అధికారం ఇవ్వడమే కాదు, ఆ అధికార వినియోగానికి స్పష్టమైన పరిమితులను కూడా విధిస్తాయి. చట్టం అనుమతించిన మేరకే చర్యలు తీసుకోవాలి. చట్టం ఇవ్వని అధికారాన్ని స్వయంగా సృష్టించుకోవడానికి అవకాశం లేదు. హైడ్రా వంటి సంస్థల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఒక జీవో ద్వారా ఏర్పాటు చేసిన సంస్థకు చట్టబద్ధమైన రెవెన్యూ అధికారాలపై పూర్తి ఆధిపత్యం ఉండదు. భూఆక్రమణల విషయంలో సంబంధిత చట్టాలు, రెవెన్యూశాఖ అధికారాలు, సహజన్యాయ సూత్రాలు అన్నీ పాటించాల్సిందే. నోటీస్ ఇవ్వకుండా, వినతులు వినకుండా, కోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టి పరిపాలనా చర్యలు తీసుకోవడం రాజ్యాంగపరంగా నిలబడటం కష్టం.

ఇటువంటి సందర్భాల్లో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఏమిటంటే ప్రభుత్వ మద్దతు ఉన్నదనే భావనతో అధికారులు తమ అధికార పరిధిని దాటి వ్యవహరించడం. రాజకీయ నాయకత్వం మారుతుంది. ప్రభుత్వాలు మారుతాయి. కానీ సివిల్ సర్వెంట్ మాత్రం రాజ్యాంగానికి విధేయుడిగా కొనసాగాలి. అధికారికి రక్షణ కల్పించేది రాజకీయ నాయకత్వం కాదు, చట్టబద్ధమైన విధి నిర్వహణ మాత్రమే.

భారతదేశ పరిపాలనా చరిత్రలో ఎన్నో సందర్భాల్లో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. నేను ప్రభుత్వ ఆదేశాలు పాటించాను అనే కారణం కోర్టు ధిక్కరణకు రక్షణ కాదని పలు తీర్పులు పేర్కొన్నాయి. చట్టవిరుద్ధమైన ఆదేశాన్ని అమలు చేయకుండా ఉండటం కూడా ఒక ప్రభుత్వ అధికారి విధిలో భాగమే. భారత రాజ్యాంగం హైకోర్టులకు కేవలం వివాదాలను పరిష్కరించే అధికారాన్ని మాత్రమే ఇవ్వలేదు. అధికరణం- 215 ప్రకారం ప్రతి హైకోర్టు ఒక కోర్ట్ ఆఫ్ రికార్డ్. అంటే తన గౌరవాన్ని, తన ఆదేశాల అమలును కాపాడుకొనే స్వతంత్ర అధికారాన్ని కలిగి ఉంటుంది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొనే అధికారం కూడా ఈ రాజ్యాంగ నిబంధన నుంచే ఉద్భవిస్తుంది. ఇది వ్యక్తిగతంగా న్యాయమూర్తి ప్రతిష్ఠను కాపాడేందుకు కాదు, న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు.

కోర్టు ఒక ఉత్తర్వు ఇచ్చిన తర్వాత ప్రభుత్వ అధికారి దానిని అమలు చేయకుండా పదేపదే నిర్లక్ష్యం చేస్తే, అది ఒక వ్యక్తిపై జరిగిన అన్యాయం మాత్రమే కాదు, మొత్తం రాజ్యాంగ వ్యవస్థకే సవాలు చేసినట్టే. అందుకే సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో రూల్ ఆఫ్ లా అనేది భారత రాజ్యాంగపు ప్రాథమిక నిర్మాణంలో భాగమని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయడానికి ఏర్పడుతాయి. అయితే ప్రభుత్వ ప్రతి చర్య కూడా చట్టానికి లోబడే ఉండాలి. కార్యనిర్వాహకశాఖ తనకు నచ్చిన విధంగా చట్టాలను అమలు చేయడం, లేదా కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) ఒక చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. అది చట్టానికి లోబడి ఉన్నంత వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

భూపరిపాలన విషయంలో శాసనసభ రూపొందించిన రెవెన్యూ చట్టాలు స్పష్టంగా అధికారాలను నిర్దేశిస్తాయి. భూమి యాజమాన్యం, ఆక్రమణ, సర్వే, రికార్డుల సవరణ, స్వాధీనం వంటి అంశాలకు సంబంధించి ఏ శాఖకు ఏ బాధ్యత అనే విషయం చట్టం నిర్ణయిస్తుంది. అలాంటి పరిస్థితిలో ఒక కార్యనిర్వాహక సంస్థ తన పరిధిని దాటి ఇతర శాఖల చట్టబద్ధ అధికారాలను నిర్వీర్యం చేస్తే, అది న్యాయపరమైన ప్రశ్నలను లేవనెత్తడం సహజం.

ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారి ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని, చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా, సమగ్రతతో వ్యవహరించాలి. అధికార వినియోగం ఎప్పుడూ చట్టబద్ధమైన పరిమితుల్లోనే ఉండాలి. ప్రభుత్వం ఒక చర్య తీసుకోవాలని చెప్పిందనే కారణంతో చట్టవిరుద్ధమైన ఆదేశాలను అమలు చేయడానికి రూల్స్ అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వాలు మారినప్పుడు కూడా ఆ అధికారులే పనిచేస్తారు. కాబట్టి వారి విధేయత వ్యక్తులకు కాదు; రాజ్యాంగానికి లోబడి ఉండాలి. న్యాయవ్యవస్థ తరచూ చెప్పే ఒక ముఖ్యమైన సూత్రం ఏమిటంటే, అధికారం ఎంత ఎక్కువగా ఉంటే, బాధ్యత కూడా అంత ఎక్కువగా ఉంటుంది. ప్రజల ఆస్తి, నివాసం, జీవనోపాధిపై ప్రభావం చూపే అధికారాన్ని వినియోగించే ప్రతి అధికారి కూడా అత్యంత జాగ్రత్తగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి. లేకపోతే ప్రజాస్వామ్యంలో అధికారంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. ఈ మొత్తం పరిణామం నుంచి ప్రభుత్వాలు కూడా ఒక పాఠం నేర్చుకోవాలి. చట్టబద్ధమైన పరిమితుల్లో పనిచేసే అధికారిని ప్రభుత్వం రక్షించడం సహజం. కానీ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన చర్యలను సమర్థించడం, న్యాయవ్యవస్థతో ఘర్షణకు దారితీసే పరిస్థితులను సృష్టించడం ప్రజాస్వామ్య పరిపాలనకు అనుకూలం కాదు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే రాజ్యాంగ వ్యవస్థ బలపడుతుంది.

## చిన్న ఎల్కిచర్ల రోడ్డు దుస్థితిపై బిజేపీ నేత గోపి నర్సింలు ఆందోళన



**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్ల--శ్రీరంగాపూర్ రహదారిని వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ సీనియర్ నాయకులు గోపి నర్సింలు ప్రభుత్వాన్ని కోరారు. వర్షం పడితే రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారి, గుంతలతో ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. దీంతో గ్రామానికి వచ్చే స్కూల్ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. గ్రామంలో ఉన్న కంపెనీలు కూడా సామాజిక బాధ్యతగా రోడ్డు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, ప్రమాదాలు జరగకముందే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## లాలాపేట ప్రభుత్వ పాఠశాల దుస్థితి..

**ప్లాస్టిక్ కవర్ల కిందే విద్యార్థులకు బోధన**



**రంగారెడ్డి జిల్లా జులై 30 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలాపేట ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో 26 మంది విద్యార్థులు భయాందోళనల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు.

వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారడంతో, వర్షం లోపలికి రాకుండా ఉపాధ్యాయులు ప్లాస్టిక్ కవర్లు కప్పి తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో పైకప్పు పెచ్చులు ఊడి పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి కొత్త పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.



## టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటు కార్యక్రమం

-బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్




**కొత్తగూడెం జూలై (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ అధ్యక్షతన టాటా లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ నందు అడ్వైసర్లుగా పని చేయుటకు సిద్ధంగా ఉన్న వారికి కొత్తగూడెం శ్రీ సాయి రామ్ ఫంక్షన్ హాల్ నందు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రైనింగ్ కు హాజరైన 150 అడ్వైసర్లకు మొక్కలు అందజేసి..తమ ఇంట్లో నాటుకుని మొక్క బ్రతికేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఓ వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి మొక్క నాటుతున్న ఫోటో, మొక్క బాగోగులు చూస్తున్న ఫోటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ యొక్క లక్ష్యం ప్రతీ ఇంటికి వారి మానవ విలువను తగిన ఇన్సూరెన్స్ పాలసీ అందించడం అని...ఈ ట్రైనింగ్ ద్వారా ప్రతీ ఇంటికి ఇన్సూరెన్స్ అందిస్తామనే సంకల్పాన్ని తీసుకోవడం జరిగింది. బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికే కాదు, మన ఆరోగ్యానికి సమాజానికి కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.ఆక్సిజన్ను అందిస్తాయి -- మనం శ్వాసించడానికి అవసరమైన స్వచ్ఛమైన ఆక్సిజన్ను విడుదల చేస్తాయి.కాలుష్యాన్ని తగ్గిస్తాయి -- గాలిలోని కార్బన్ డైఆక్సైడ్ మరియు ఇతర కాలుష్య పదార్థాలను గ్రహించి గాలిని శుభ్రపరుస్తాయి.వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి -- ఉష్ణోగ్రతలను తగ్గించి చల్లని వాతావరణాన్ని కల్పిస్తాయి.వర్షాలకు తోడ్పడతాయి -- పచ్చదనం పెరగడం వల్ల వర్షపాతం మెరుగుపడటానికి సహాయపడుతుంది.నేల కోతను నివారిస్తాయి -- చెట్ల వేర్లు మట్టిని బలంగా పట్టుకుని నేల కోతను తగ్గిస్తాయి.పక్షులు, జంతువులకు ఆశ్రయం కల్పిస్తాయి -- జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.పండ్లు, పూలు, ఔషధాలు అందిస్తాయి -- అనేక మొక్కలు ఆహారం ఔషధాల మూలంగా ఉపయోగపడతాయిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శర్మ బ్రాంచ్ బిజినెస్ అసోసియట్ మేనేజర్ రాహుల్, సునీత, టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ లీడర్లు తారప్రసాద్, కేశవరావు, మహేష్, ఉమాకర్, నాగులు మీరా,రమేష్, రవీందర్, శివలీల, బాబురావు, కృష్ణార్జున, బొర్రా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, జులై 30(స్కైన్యూస్ ):**జిల్లాలో జాతీయ రహదారులపై కొనసాగుతున్న అన్ని రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఏఐ) అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. జానకితో కలిసి నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గత జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యల పై చర్చించారు, ఇంకా పూర్తికాని పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై నిర్మాణ పనులు ఆలస్యం కావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని కలెక్టర్ అన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో తగిన హెచ్చరిక బోర్డులు, డైవర్షన్లు, రోడ్డు మార్కింగ్లు, లైటింగ్, క్రాష్ బ్యారియర్లు, ఇతర భద్రతా చర్యలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.మూసాపేట, రాజాపూర్, జడ్చర్ల, పొన్నకల్ జంక్షన్ తదితర కీలక ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట సంయుక్త తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్కు ఇబ్బంది కలిగిస్తున్న అంశాలపై ఇంజినీరింగ్ పరమైన పరిష్కారాలను అమలు చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం విషయంలో జిల్లా కలెక్టర్ నేషనల్ హైవే అధికారులపై ఆగ్రహం వ్యయం చేశారు. పనుల పూర్తికి పదేపదే గడువులు పొడిగించడం సరికాదని హెచ్చరించిన కలెక్టర్, ఆగస్టు 15లోగా అన్ని ప్రాధాన్య పనులు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. పనుల పురోగతిపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు జియో ట్యాగ్ ఫోటోలతో పాటు పనులు, కార్మికుల సంఖ్య, ప్రస్తుత పరిస్థితిపై నివేదికను తప్పనిసరిగా పంపాలని ఎన్హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారుల పనితీరుపై ఎన్హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయానికి నివేదిస్తానని హెచ్చరించారు. రోడ్డు భద్రత అత్యంత కీలకమైన అంశమని, ఇందులో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.అలాగే పట్టణ ప్రాంతాల్లో ఫుట్పాత్లపై ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్, పోలీసు, రోడ్లు--భవనాల శాఖ అధికారులు సమన్వయంతో దశలవారీగా ఫుట్పాత్ల ఆక్రమణలు తొలగించి పాదచారులకు సురక్షితంగా నడిచే అవకాశం కల్పించాలని ఆదేశించారు.

**జిల్లా ఎస్పీ డి. జానకి**

మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పోలీసు శాఖ సూచించిన భద్రతా చర్యలను సంబంధిత శాఖలు తక్షణమే అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధి కోట బాబు, రోడ్లు--భవనాల శాఖ, రవాణా శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.ఎస్పీ డి. జానకితో కలిసి వర్షాల పరిస్థితులపై సమీక జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ డి. జానకితో కలిసి వర్షాల పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రహదారులు, కల్వర్టులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కాలువల నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పరిశీలించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు, మత్స్యకారులు, సందర్శకులు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో దప్పు చాటింపు, మైకుల ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అవసరమైతే అందులో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బిజినెస్

# జరిమానాలు రూ.7,087 కోట్లు

**కనీస నగదు నిల్వల్లేని ఖాతాదారుల నుంచి ఏడాదిలో వసూలు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు**




**న్యూఢిల్లీ :** గత ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు.. కరెంట్/సేవింగ్స్ ఖాతాల్లో కనీస నగదు నిల్వల మొత్తాలను నిర్వహించని కస్టమర్ల నుంచి దాదాపు రూ.7,087 కోట్లు వసూలు చేశాయి. ఇందులో ప్రైవేట్ బ్యాంకులు రూ.4,948.71 కోట్లు, సర్కారీ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు కలెక్ట్ చేసినట్టు ఓ ప్రశ్నకుగాను మంగళవారం రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ (రూ.1,081.33 కోట్లు) ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా (ఆర్బీఐ) వివరాలను మంత్రి పేర్కొన్నారు. అలాగే మొత్తం 19 ప్రైవేట్ రంగ బ్యాంకులు చేసిన వసూళ్లలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్‌ల వాటానే 58 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ఖాతాలు సహా ఇతర బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లపై ఈ చార్జీలేవీ పడలేదని స్పష్టం చేశారు. కాగా, గడిచిన 4 ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు ఇలా ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేకపోతే ఖాతాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలు రూ.26, 170.37 కోట్లుగా ఉండటం గమనార్హం.

**రూ.75,000 కోట్ల మోసం**

కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్టీ) అధికారులు.. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.75,000 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మోసాన్ని గుర్తించారు. అత్యధికంగా గుజరాత్, మహారాష్ట్రల్లోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఈ మేరకు సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు లిఖితపూర్వకంగా సమాచారమిచ్చారు. ఐరన్ అండ్ స్టీల్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్స్, పేపర్ ప్రొడక్ట్స్,ప్లైవుడ్, సిమెంట్, కాపర్ వంటి గూడ్స్‌తోపాటు కాంట్రాక్ట్ సర్వీస్, మ్యాన్‌పవర్ సైప్లై సర్వీసెస్, రియల్ ఎస్టేట్ సర్వీసెస్ వంటి సేవల్లోనూ పన్ను ఎగవేతల్ని గుర్తించామని చెప్పుకొచ్చారు. మొత్తం 30,162 కేసులు నమోదయ్యాయని, వీటి విలువ రూ.74,782 కోట్లుగా ఉందని మంత్రి వివరించారు. గుజరాత్‌లో 12,511 కేసులు (రూ.12,633 కోట్లు), మహారాష్ట్రలో 9,629 కేసులు (18,320 కోట్లు) నమోదయ్యాయి. ఇక మొత్తంగా 2025-26లో 358 మంది అరెస్టయ్యారు.

**క్షీణించిన ఎఫ్‌డీఐలు**

గత కొన్నేండ్లుగా దేశంలోకి నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుతున్నాయని పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా వెల్లడించారు. 2022-23లో 27.99 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2025-26లో 6.95 బిలియన్ డాలర్లకే పరిమితమైనట్టు రాజ్యసభలో మంత్రి ప్రకటించారు. కాగా, విదేశీ మదుపర్లు తమతమ దేశాలకు పంపుతున్న నిధులు పెరుగడం, అలాగే భారత్ నుంచి పెట్టుబడులను వెనుకకు తీసుకుంటుండటమే కారణమని చెప్పారు. 2023-24లో 10.13 బిలియన్ డాలర్లుగా ఉన్న నికర ఎఫ్‌డీఐ.. 2024-25లో 960 మిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలను ఉటంకిస్తూ వివరించారు. నిజానికి గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి రికార్డు స్థాయిలో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అయితే మళ్లీ 88 బిలియన్ డాలర్లదాకా తరలిపోయాయి.

## జీడీపీ బాగా తగ్గొచ్చు: రాయిటర్స్ సర్వే

**మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులే**




**బెంగళూరు :** దేశ ఆర్థిక వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గణనీయంగా పడిపోవచ్చని రాయిటర్స్ పోల్‌లో తేలింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) భారత జీడీపీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. ఈసారి మాత్రం మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలను మెజారిటీ ఎకనామిస్టులు వ్యక్తం చేయడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) కూడా వృద్ధిరేటు ఆశించిన స్థాయిలో ఉండదని చెప్తుండటం.. ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఓవైపు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లు క్షీణిస్తున్నాయని, మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయని ఎక్స్‌పర్ట్స్ గుర్తుచేస్తున్నారు. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరిగే క్రూడాయిల్ రేట్లు.. ఎకానమీ వృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని చెప్తున్నారు. అదుపు తప్పుతున్న ద్రవ్యోల్బణం, మార్కెట్‌లో పడిపోతున్న డిమాండ్, దిగజారుతున్న వినియోగదారుల కొనుగోలు శక్తి.. అన్నీ ప్రతికూల సంకేతాలుగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.6 శాతంగానే ఉండొచ్చని రాయిటర్స్ పోల్‌లో అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా 6.8 శాతంగానే ఉండొచ్చని అంటున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం 7.7 శాతంగా ఉన్నది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు




**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు ఒక్కరోజులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం భారీగా పెరిగిన ధరలు ఆ మరుసటి రోజూ అంతేస్థాయిలో కిందికి పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, రూపాయి పుంజుకోవడం ధరలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా న్యూ ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,640 తగ్గి రూ.1.47 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు రూ.1, 49,640గా ఉన్నదని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా దిగొచ్చాయి. కిలో వెండి ఏకంగా రూ.5,200 తగ్గి రూ.2,24, 800గా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పెరగడంతో మదుపర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఔన్స్ గోల్డ్ ధర 53.40 డాలర్లు లేదా 1.31 శాతం తగ్గి 4,023.50 డాలర్లకు పరిమితమవగా, వెండి 2 శాతం దిగి 57.24 డాలర్లుగా ఉన్నది.

## హెచ్‌యూఎల్ మరోసారి ధరల పోటు!




**న్యూఢిల్లీ :** హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) మరోసారి తన ఉత్పత్తుల ధరలను పెంచడానికి సిద్ధమవుతున్నది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన ద్రవ్యోల్బణంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికం నాటికి ధరల సూచీ 2-5 శాతం వరకు పెరిగే అవకాశం ఉండటంతో ధరల పెంపు అనివార్యమనిపిస్తున్నదని హెచ్‌యూఎల్ సీఈవో, ఎండీ ప్రియా నాయర్ తెలిపారు. ఇప్పటికే 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఉత్పత్తుల ధరలను 2-5 శాతం వరకు సవరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమన్నాయని, దీంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే కసరత్తును ప్రారంభించినట్టు చెప్పారు. వీటికితోడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఎల్ నినో ప్రభావంతో అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆమె హెచ్చరించారు.

## క్రిప్టో ఇన్వెస్టర్లకు ఊరట.. ఇక ఐటీఆర్ దాఖలు సులభం

**'ట్యాక్స్‌లిస్ట్' టూల్‌ను తెచ్చిన వజీర్‌ఎక్స్**



**న్యూఢిల్లీ :** గత కొన్నేండ్లుగా క్రిప్టో కరెన్సీల్లో మదుపు చేసేవారు క్రమేణా పెరుగుతున్నారు. అయితే ఏటా ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్ దాఖలు చేయాలంటే మాత్రం వీరికి తిప్పలు తప్పడం లేదు. ఈ క్రమంలోనే భారతీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్.. ఓ ఉచిత పన్ను నివేదిక సాధనాన్ని తీసుకొచ్చింది. ఐటీఆర్ దాఖలుకు గడువు తేదీ దగ్గరపడుతున్న క్రమంలో క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు ఊరటనిస్తూ 'ట్యాక్స్‌లిస్ట్' పేరిట ఫ్రీ క్రిప్టో ట్యాక్స్ రిపోర్టింగ్ వేదికను మంగళవారం పరిచయం చేసింది. దీంతో ఇక రకరకాల క్రిప్టో ఎక్స్ఛేంజీలలో జరిపిన లావాదేవీలకు సంబంధించి సులువుగానే ఇన్వెస్టర్లు తమ పన్ను నివేదికలను ఈ టూల్ ద్వారా అందుకోవచ్చని వజీర్‌ఎక్స్ చెప్తున్నది. ఏ ఎక్స్ఛేంజ్ నుంచైనాసరే మదుపర్లు తమ లావాదేవీల చరిత్రలను ట్యాక్స్‌లిస్ట్ ప్లాట్‌ఫామ్‌పై అప్‌లోడ్ చేసి లాభాలు, నష్టాలు, చెల్లించాల్సిన పన్ను వివరాల నివేదికలను నిమిషాల్లో పొందవచ్చని ఈ సందర్భంగా వజీర్‌ఎక్స్ తెలిపింది. క్రిప్టో ట్యాక్స్ లెక్కింపును సులభతరం చేసేలా ఈ సాధనాన్ని డిజైన్ చేశామని, ట్యాక్స్‌లిస్ట్ దానంతటదే వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సహా అన్నింటి లాభనష్టాలను అంచనా వేసి కచ్చితమైన రిపోర్టును ఇస్తుందన్నది.

# భళా షర్మిల.. అదరహో అజయ్..

**పారా షాట్‌పుట్‌లో పసిడితో ధన్‌ఖడ్ కొత్త చరిత్ర**

**ఏపీ లిఫ్టర్ అజయ్, హర్జిందర్, హై జంపర్ సర్వేశ్‌కు రజతాలు**

**శిల్పకు కాంస్యం.. తండ్రిని మించిన కొడుకు**




గ్లాస్గో : పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. మహిళల పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌తో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్డ్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను (కౌంట్ బ్యాక్) లెక్కించారు. ఒకేసారి విఫలమైన బెక్‌ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు.

**ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్**

ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్‌ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్‌లో గోల్డ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147౦184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు. కాగా, మహిళల 63 కిలోల విభాగంలో నిరుపమ నిరాశపరిచింది.

**విధిరాతను ఎదిరించి.. స్వర్ణ చరిత్రను లిఖించి**

ఒకవైపు వైకల్యం.. మరోవైపు నరకం చూపించే గృహ హింస.. ఇంకోవైపు ఇద్దరు చిన్నారులతో వీధిపాలైన దయనీయ స్థితి. ఇక ఈ జీవితం ముగిసిపోయింది.. ఆత్మహత్యే శరణ్యం అని అనుకున్న అత్యంత చీకటి క్షణంలో ఆమె ఒక ఓ నిర్ణయం తీసుకుంది. 'నా జీవితానికి మరో అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?' అని తన్నుకొచ్చిన ఆ ఆలోచనే ఆమె భవితవ్యాన్నే మార్చేసింది. చావు అంచున నిలబడి బతుక్కి రెండో చాన్స్ ఇచ్చిన ఆ నిర్ణయమే హర్యానాకు చెందిన 42 ఏండ్ల షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్‌లో పసిడి పతకం నెగ్గేలా చేసింది. హర్యానాలోని మహేందర్‌గఢ్ జిల్లా చిత్రౌలి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించింది షర్మిల.

తల్లి చూపులేనిది కావడంతో బాల్యం నుంచే కష్టాలు చవిచూసింది. రెండేండ్ల వయసులోనే తీవ్రమైన జ్వరం రాగా, సరైన వైద్యం అందక ఎడమ కాలు పోలియో బారిన పడింది. పదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన ఆమెకు 19 ఏండ్లకే పెళ్లి చే03శారు. అదనపు కట్నం తెమ్మంటూ భర్త తీవ్రంగా వేధించేవాడు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిందనే కోపంతో ఓ రోజు రాత్రి 11 నుంచి 3 గంటల దాకా చితకబాది, ఇద్దరు పసిపాపలతో సహా రోడ్డుపైకి తోసేశాడు. కనీసం బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దయనీయ స్థితిలో షర్మిల ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకుంది. వారి పోషణ కోసం ఇండ్లలో పనులతో పాటు సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేసింది. ఇన్ని కష్టాల నడుమ వ్యాపారవేత్త అజిత్ సింగ్ రూపంలో ఆమెకు ఓ చేయుత లభించింది. అజిత్‌తో రెండో వివాహం జరిగాక ఆమె జీవితం మలుపు తిరిగింది. షర్మిల మానసిక దృఢత్వాన్ని, పట్టుదలను గుర్తించిన అజిత్ 2020లో (34 ఏండ్ల వయసులో) ఆమెను పారా అథ్లెటిక్స్ వైపు ప్రోత్సహించాడు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ ప్రకటించే వయసులో షర్మిల తొలిసారి చేతిలోకి షాట్‌పుట్ గుండును పట్టింది. కోచ్‌లు టెక్ చంద్, దేవేంద్ర పర్యవేక్షణలో కఠిన సాధన చేసింది. ఆమె శిక్షణ, డైట్ ఖర్చుల కోసం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తట్టుకుంటూ 2023లో తమ సొంతింటిని కూడా అమ్మేసి అద్దె ఇంట్లోకి మారింది. 2022 కామన్వెల్త్ గేమ్స్, 2023 ఆసియా పారా గేమ్స్‌లో నాలుగో స్థానంతో తృటిలో పతకాలు చేజారినా షర్మిల వెనకడుగు వేయలేదు. పట్టువదలకుండా శ్రమించి, గ్లాస్గో వేదికగా తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కష్టాలు వచ్చినా జీవితం అక్కడితో ముగిసిపోదని షర్మిల ఈ విజయంతో నిరూపించింది. విధిరాతను ఎదిరిస్తూ.. జీవితానికి రెండో అవకాశం ఇస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ప్రపంచానికి చాటిచెప్పింది.

**తండ్రిని మించిన కొడుకు**

భారత్ ఆతిథ్యం ఇచ్చిన 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో ఏపీ లిఫ్టర్ శ్రీనివాసరావు 56 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలవగా.. 16 ఏండ్ల తర్వాత అతని కొడుకు అజయ్ బాబు మరో అడుగు ముందుకు వేసి రజత పతకంతో తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్‌కు ఆరేండ్ల వయసు ఉన్నప్పుడు శ్రీనివాసరావు కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం గెలిచాడు. ఆ రోజు ఊరంతా తమ ఇంట్లో టీవీకి అతుక్కుపోయి సంబరాలు చేసుకోవడం, ఆ పతకం తమ కుటుంబ ఆర్థిక కష్టాలను తీర్చడం అజయ్ చిన్నతనంలోనే చూశాడు. తండ్రి బాటలోనే క్రీడాకారుడిగా ప్రయణం ప్రారంభించాడు. శ్రీనివాసరావు స్వయంగా కొడుకుకు శిక్షణ ఇచ్చి వెయిట్‌లిఫ్టింగ్ మెళకువలు నేర్పించాడు. ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురై జాతీయ టోర్నీల్లో విఫలమైనా.. 2024లో మోచేతి గాయంతో ఆటకు దూరమైనా తండ్రి అందించిన మనోధైర్యంతో అజయ్ మళ్లీ పుంజుకున్నాడు. గతేడాది కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో 335 కేజీలు ఎత్తి స్వర్ణం సాధించి సత్తా చాటాడు. ఇప్పుడు కామన్వెల్త్ గేమ్స్ రజతంతో మరో మెట్టుఎక్కాడు.

# స్పోర్ట్స్

## 5 ఓవర్లు మెయిడిన్లు వికెట్లు

**విండీస్ బౌలర్ గ్రీవ్స్ రికార్డు ప్రదర్శనకు పాక్ కుదేలు**



**ట్రినిడాడ్ :** స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ పేసర్ జస్టిన్ గ్రీవ్స్ (5/27)రికార్డు ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను గజగజ వణికించాడు. వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 5 వికెట్లు పడగొట్టి పాక్ వెన్నువిరిచాడు. గ్రీవ్స్ పేస్ మ్యాజిక్‌తో తొలి ఇన్నింగ్స్ ఒక దశలో 62.5 ఓవర్లకు 244/3తో ఉన్న పాక్.. ఏడు ఓవర్ల వ్యవధిలోనే ఆరు వికెట్లు కోల్పోయి 267/9తో నిలిచింది. 64వ ఓవర్లో బంతినందుకున్న గ్రీవ్స్.. మొదట షాన్ మసూద్ (109)ను ఔట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో అలి ఉస్మాన్, జమాల్, రిజ్వాన్, అబ్బాస్‌ను ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

## సోనమ్ జోడీకి కాంస్యం



**హాంగ్జౌ :** ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ సోనమ్-హిమాన్షు కాంస్యం గెలిచింది. ఫైనల్‌లో భారత జంట 441.2 పాయింట్లు సాధించగా చైనాకు స్వర్ణం, రజతం దక్కాయి. ఈ టోర్నీలో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు రెండు కాంస్యాలతో నాలుగు పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది.



# సిత్తరాల నవ్వు.. సిలకల్లే నువ్వు..

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. జి.జి.విహారి దర్శకుడు. రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రవి పనస ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి రెండో పాట 'సిత్తరాల నవ్వు' విడుదలైంది. కృష్ణప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు జి.జి.విహారి సాహిత్యాన్ని అందించారు. జావెద్ అలీ ఆలపించారు. 'సిత్తరాల నవ్వు..అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు..' అంటూ కథానాయిక అందాన్ని వర్ణిస్తూ ఈ పాట సాగింది. పల్లెటూరి నేపథ్యంలో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: కె.పి, కథ, దర్శకత్వం: జి.జి.విహారి.

# చిట్టి చేతులతో అయ్యో రామా..



దుల్కర్ సల్మాన్ మలయాళంలో పెద్ద స్టార్. అలాగే తెలుగు ప్రేక్షకులకూ అభిమాన నటుడు. దుల్కర్ తెలుగులో నేరుగా చేసిన మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ చిత్రాలు వసూళ్ల పరంగా వందకోట్ల మార్కును దాటాయి. ఇప్పుడున్న ఏ పరభాషా నటుడికీ దక్కని రికార్డ్ ఇది. ప్రస్తుతం ఆయన తెలుగులో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా చేస్తున్నారు. శ్రుతిహాసన్, సాత్విక వీరవల్లి కథానాయికలు. పవన్ సాదినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. మంగళవారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'చిట్టి చిట్టి చీమ.. చిట్టి చేతుల్తో అయ్యో రామా.. వంద టన్నుల చెక్కెర మోస్తుందమ్మా..' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. రమ్య బెహరా ఆలపించారు. కథలోని సారాంశాన్ని ఈ పాట సాహిత్యంలో మిళితం చేసి రాసినట్టుగా హీరోయిన్ కోణంలో ఈపాట సాగింది. నక్షత్రాలను తాకాలని కలలు కనే ఓ అమ్మాయి కలను, ఆమె పక్కనే నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే అబ్బాయి ప్రేమను ఈ పాట ప్రతిబింబిస్తున్నది. సంప్రదాయ ప్రేమకథలకు భిన్నంగా, ఒక ప్రత్యేకమైన బంధాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

# ఆరు నెలలు నాతో మాట్లాడలేదు

'లెనిన్'తో ఎట్టకేలకు హిట్ ట్రాక్ ఎక్కేసింది పూణే పూబోణి భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం 'లెనిన్' సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తూ, మరోవైపు తమిళంలో శివకార్తికేయన్ సరసన 'సియోన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. తాజాగా ఓ కళాశాల విద్యార్థులతో టాక్ షోలో ముచ్చటించిన భాగ్యశ్రీ.. తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నది. 'నాకు నటనంటే ఇష్టం. నటిని కావడం నా గోల్. కెరీర్ విషయంలో మన నిర్ణయాన్ని మన మనస్సాక్షి అంగీకరించినప్పుడు, ఇక ఏ విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ రాజీ పడాల్సివస్తే, మనకు మనమే పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. అందుకే నా నిర్ణయాన్ని నేరుగా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. 'వద్దు' అనింది. నాన్నకు ఫోన్ చేస్తే 'అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావ్?' అని ప్రశ్నించారు. అక్క అయినా మద్దతుగా నిలుస్తుందనుకుంటే.. 'అమ్మ నాన్న వద్దంటున్నారు కదా?' అనేసింది. ఇలా అంతా 'నో' చెప్పేశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆడిషన్స్‌కి వెళ్లిపోయా. దీంతో ఇంట్లో వాతావరణం వేడెక్కింది. మా అమ్మ ఆరు నెలలు నాతో మాట్లాడ్లేదు. నన్ను వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసింది. ఇప్పుడు ఈ విషయాన్ని నవ్వుతూ చెబుతున్నాను కానీ.. అప్పుడు మాత్రం చాలా బాధపడ్డా' అంటూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే.






# సిరీస్ చూసి చిరంజీవి మెచ్చుకున్నారు

శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సిరీస్ 'అబ్జెక్షన్ మై లార్డ్'. 'నోటరీ పరశురాం' అనేది ఉపశీర్షిక. అనన్యశర్మ, ముఖేష్‌రుషి, స్నేహాల్, సమీర్ కీలక పాత్రధారులు. సంతోష్ అయ్యప్పన్ దర్శకుడు. రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మాత. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 31 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ కానున్నది. తాజాగా హైదరాబాద్‌లో ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌ని నిర్వహించారు. 'దర్శకుడు క్లారిటీతో ఈ సిరీస్ తెరకెక్కించారు. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. టోటల్ అవుట్‌పుట్ చూశాక ఫిదా అయ్యాం. ప్రతి పాత్రలోనూ మంచి ఎలివేషన్ ఉంటుంది. చిరంజీవి ఈ సిరీస్ చూసి బావుందని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మా టీమ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ 'కేవలం 19రోజుల్లో ఈ సిరీస్ షూటింగ్ పూర్తి చేశాం. టీమ్ అంతా సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. ఈ సిరీస్ సూపర్ సక్సెస్ అవుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల, నటులు ముఖేష్ రిషి, అనన్యశర్మ, సమీర్, నారాయణ హరిచంద్ర, జెమినీ సురేశ్ కూడా మాట్లాడారు.

వార్తాతరంగాలు



# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్



యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది.

**రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాషను వాడారు: జితేంద్రసింగ్**

అంతకుముందు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు.

"ప్రతిపక్షాలను చూస్తుంటే ఈ దృశ్యం చాలా నిరాశ కలిగించేలా ఉంది. ఇంతటి ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో, ఎంతో సున్నితత్వంతో ఈ బిల్లును సభలోకి తీసుకొచ్చినప్పుడు సీరియస్‌గా చర్చించి, సలహాలు ఇవ్వడానికి బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత ప్రవర్తన చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. రాహుల్ గాంధీ అప్రజాస్వామిక భాష వాడారు. ఆయన వాడిన పదాలు సభా సంప్రదాయాలకు విరుద్ధమైనవి. అంతేకాదు అది ఎంతటి అన్‌పార్లమెంటరీ పదమంటే ఆ పదాన్ని నేను నా నోటితో ఉచ్చరించలేను. ఒకవేళ ఏ వ్యక్తినా లేదా గౌరవసభ్యుడైనా తనను తాను 'ఇడియట్' అనుకున్నప్పటికీ, ఆ పదాన్ని ఇక్కడ వాడకూడదు. సభ వెలుపల వెళ్లి అనవచ్చు కానీ, సభలో అనటానికి వీల్లేదు. ప్రతిపక్ష నేతకు ఇలాంటి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది."

**కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు- మేజిస్ట్రేట్ ఇస్తారు: జితేంద్రసింగ్**

కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను జితేంద్ర సింగ్? ఖండించారు. "కాల్పుల ఆదేశాలను మంత్రి ఇవ్వరు మేజిస్ట్రేట్ ఇస్తారు. అసలు కాల్పులు జరగనే లేదు. బాష్పవాయువు ప్రయోగించారు. కాల్పులు జరగకపోతే ఆదేశాలు ఇచ్చారనే మాటకు అర్థం లేదు. హోంమంత్రి విదేశాలకు వెళ్లారని ఆరోపణలు చేస్తున్నారు. హోంమంత్రి విదేశాలకు వెళ్లినట్లు మాకెలాంటి సమాచారం లేదు. అవాస్తవాలు చెప్పి సభ నుంచి వెళ్లడం బాధ్యతాయుతం కాదు. ప్రధాని నివాసం ముందు బైఠాయించి నిరసన తెలపడం సమంజసం కాదు. ప్రధాని నివాసం ముందు నిరసన సముచితం కాదని చెప్పినా పట్టించుకోలేదు. 150 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అన్నిసార్లు పేపర్ లీక్ అయ్యాయనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. 150 సార్లు పేపర్ లీక్ వల్ల 750 కోట్ల విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. దేశ జనాభాను ప్రపంచ జనాభాతో పోల్చి ప్రియాంక చెప్పారు. ఎన్‌డీఏ హయాంలో 30 శాతం మేర ఉన్నత విద్యాలయాలు పెరిగాయి. ఎన్‌డీఏ హయాంలో 763 యూనివర్సిటీల నుంచి 1293కి పెంచాం." అని జితేంద్ర సింగ్ అన్నారు.

**గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష**

పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు-2026ను ఇంతకుముందు కేంద్రం ప్రతిపాదించింది. పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించింది. జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేసింది. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను కోటి నుంచి 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చింది. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదన చేసింది. నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, 5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను కోటి నుంచి 10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది.

## 'ఎన్నిసార్లు చెప్పాలి'

# జమ్మూకశ్మీర్, లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే




జమ్మూకశ్మీర్‌పై పదే పదే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నవారికి భారత విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) బుధవారం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఓ ప్రముఖ అమెరికన్ టీవీ షోలోని ఒక క్యారెక్టర్ వైరల్ మీమ్‌ను షేర్ చేస్తూ, "నేను మీకు ఇది ఎన్ని సార్లు వివరించాలి" అనే క్యాప్షన్‌ను జతచేసింది. ఈ విధంగా మొత్తం జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలు భారతదేశంలో అంతర్భాగాలే అని మరోసారి స్పష్టం చేసింది. భారత విదేశాంగ శాఖ తన ఇన్?స్టా పోస్టులో "జమ్మూకశ్మీర్?, లద్దాఖ్? కేంద్రపాలిత ప్రాంతాలపై పదేపదే అబద్ధాలు చెబుతూ, తప్పుడు ప్రచారాలు చేస్తే, మా స్పందన ఇలానే ఉంటుంది" అని తేల్చిచెప్పింది.

"ప్రస్తుతం పాకిస్థాన్? ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా భారత్?లో ఉన్న జమ్మూకశ్మీర్?, లద్దాఖ్?లు భారతదేశంలో విభాజ్య అంతర్భాగాలు. ప్రస్తుతం పీవోకేలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణను కప్పిపుచ్చుకోవడానికి, ఆ ప్రాంతంలో జరుగుతున్న ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఇస్లామాబాద్ దశాబ్దాలుగా చేస్తున్న వ్యవస్థాగత ఆర్థిక దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనాపరమైన అణచివేతకు ప్రత్యక్ష పర్యవసానమే పీవోకేలో జరుగుతున్న భారీ నిరసనలు."

**ఫ్యాక్ట్ చెక్?**

భారత విదేశాంగ శాఖ తన ఎక్స్? ఖాతాలో ఇదే సందేశాన్ని షేర్ చేస్తూ, ఒక నెటిజన్ చేసిన తప్పుడు వాదనలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే? ఓ నెటిజన్? తన పోస్టులో జమ్మూకశ్మీర్ గురించి తప్పుడు వాదనలు చేశాడు. "జమ్మూకశ్మీర్?, లద్ధాఖ్ భారత్?లో అంతర్భాగాలు కావు. ఐరాస తీర్మానాల ప్రకారం, ఆ మొత్తం ప్రాంతం వివాదాస్ప భూభాగం. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ, భారత్? 2019లో ఆ ప్రాంతాన్ని అక్రమంగా విలీనం చేసుకుంది. అలాకాకుండా పాక్ అధీనంలోని జమ్మూకశ్మీర్?కు? పాక్షిక స్వయంప్రతిపత్తిని కలిగి ఉంది. కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికారాన్ని నిరాకరిస్తూ, ఏజేకే ఎన్నికలను నామమాత్రపు ఎలక్షన్స్? అనడం పూర్తిగా కపటత్వం. కేవలం నియంత్రణ రేఖ (ఎల్?వోసీ)కి భారత్ వైపు ఉన్న ప్రాంతంలోనే బలవంతపు ఆక్రమణ ఉంది" అని అన్నాడు.

ఈ వాదనలను భారత విదేశాంగ శాఖ పూర్తిగా తిరస్కరించింది. పాకిస్థాన్? ఆక్రమణలో ఉన్న భూభాగాలన్నీ భారత్?తో విడదీయరాని భాగాలను స్పష్టం చేసింది. ప్రస్తుతం పీఓకేలో పాక్ నిర్వహిస్తున్న ఎన్నికలు కేవలం కంటితుడుపు చర్యలేనని పేర్కొంది. పీఓజేకేలోని రావల్?కోట్?, మిర్పూర్? ప్రాంతాల్లో ప్రాథమిక హక్కుల కోసం జరుగుతున్న నిరసనలపై పాకిస్థాన్ భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో గత రెండు రోజుల్లో పలువురు మరణించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎంఈఏ ఈ విధంగా ఘాటుగా స్పందించింది.

**పీఓకేలో నిరసనలు**

మానవ హక్కులను నిరాకరించడానికి వ్యతిరేకంగా పీఓకే ప్రజలు గత 52 రోజులుగా నిరసనలు చేస్తున్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, నిరసనకారులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, ఇతర డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జీూాజ), అధికారుల మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో, వేలాది మంది ప్రజలు ముజఫరాబాద్? వైపు మార్చ్?కు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రావల్?కోట్?లో పాక్ దళాలు జరిపిన విచక్షణారహిత కాల్పులను ఖండించారు. రావల్?కోట్?లో పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో సుమారు 14 మంది మరణించగా, చాలా మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. దీనితో జూన్? 5 నుంచి జులై 28 మధ్య మరణించిన నిరసనకారుల సంఖ్య 67కు చేరిందని జేఏఏసీ చెప్పింది. మరణించిన వారిని 'అమరవీరులు'గా పేర్కొంటూ, తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. మరోవైపు పాక్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజా సంకల్పాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పీఓజేకే నాయకులు ఆరోపిస్తున్నారు. అరెస్టులు, బెదిరింపులు, భారీ భద్రతా మోహరింపుల ద్వారా అధికారులు ప్రజలను భయపెడుతున్నారని అన్నారు. మరోవైపు రావల్?కోట్?లో నిరసనకారులపై పాక్ భద్రతా దళాలు జరిపిన మారణకాండపై తక్షణమే, స్వతంత్ర, పారదర్శక విచారణకు ఆదేశించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్? పాకిస్థాన్? అధికారులను కోరింది.

# విద్యార్థులపై వేధింపులు ఆగకపోతే మళ్లీ ఉద్యమం




నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసనలు తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు వెంటనే నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే త్వరలోనే మరోసారి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిసా మని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. దిల్లీ విమానాశ్రయం వద్ద బుధవారం మీడియాతో మాట్లాడు తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తమ భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్, పెలెట్ గన్స్ వంటి చర్యలు తీసుకోవడం తీవ్రంగా ఖండించారు. జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగం జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. వారిని ఉగ్రవాదుల మాదిరిగా పెల్లెట్ గన్స్?తో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం ఇలాంటివి చేయకూడదని, విద్యార్థులు తమ భవిష్యత్, హక్కుల కోసం పోరాడుతున్నారని అన్నారు. వారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం తగదని తెలిపారు. ఇలాగే వేధించడం కొనసాగిస్తే మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. మరోసారి ఆందోళన చేపడతారా? అనే ప్రశ్నకు స్పందించిన దిప్కే, ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే తప్పకుండా మరో ఉద్యమం ఉంటుందని చెప్పారు. అది త్వరలోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెన్-జెడ్ యువతపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై దిప్కే స్పందించారు. ఆమె వ్యాఖ్య లను ఎవరు సీరియస్‌గా తీసుకుంటారని కొట్టిపారేశారు. మరోవైపు జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన సీజేపీ నిరసనలు, చలో సంసద్ సందర్భంగా రాళ్లతో నిండిన ట్రక్కు కనిపించడంపై దిల్లీ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. సోషల్? మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ లారీకి నిరసన కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం, వివాదాస్పదంగా మారిన ట్రక్కును జులై 16న జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో స్వాధీనం చేసుకున్నారు. ఈఈసీఓ వ్యాన్?ను ట్రక్కు ఢీకొనడం వల్ల ఆరుగురు గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్?లో ఎఫ్?ఐఆర్? నంబర్ 65/2026 నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ట్రక్కును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు వివరించారు.

## విద్యార్థులపై దాడులకు అమిత్ షానే కారణం-



విద్యార్థులపై జరిగిన పోలీసు దాడికి సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయటంతోపాటు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధాని మోదీని కోరారు. దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన రాహుల్‌గాంధీ, సభలో మంత్రులకు మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా, ప్రతిపక్ష నేతనైన తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు జరిపిన వారంతా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కనుసన్నల్లోనే పనిచేస్తారని రాహుల్ ఆరోపించారు. అయితే, దెబ్బలు తిన్న ప్రతి ఒక్క విద్యార్థికి న్యాయం జరిగేలా కచ్చితంగా చూస్తామని పేర్కొన్నారు. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపిన వారికి కచ్చితంగా శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులపై జరిగిన దాడులకు సంబంధించి తమ దగ్గర ఫోటోలు, వీడియోలన్నింటినీ సేకరించామన్నారు. మరోవైపు, లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. అయితే బీజేపీ, ఆర్?ఎస్?ఎస్ లేదా మరెవరికీ తాను ఎప్పటికీ క్షమాపణలు చెప్పబోనని రాహుల్ తేల్చిచెప్పారు. సభలో మంత్రులకు మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ ఓంబిర్లా, ప్రతిపక్ష నేతనైన తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"జులై 25న కొన్ని ప్రశ్నలు సంధిస్తూ హోంమంత్రి అమిత్‌షాకు నేను లేఖ రాశా. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడకపోతే ఎవరు ఆ పని చేశారని అడిగా. విద్యార్థులపై దాడికి అమిత్‌షా బాధ్యులని నేను చెప్పా. దేశానికి ఉపయుక్తమైన అంశాలపై మాట్లాడడం విపక్ష నేతగా నా హక్కు. అయితే, ఈ అంశంపై కేంద్రాన్ని ప్రశ్నిస్తే దిల్లీ వీధుల్లో విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. పెల్లెట్ గన్ తగిలి ఒక యువకుడి కన్ను కోల్పోవాల్సి వచ్చింది. పెల్లెట్ గన్ తగిలి గాయమైనట్లు ఎయిమ్స్ మెడికల్ సర్టిఫికెట్ చూశా. అత్యంత దారుణంగా ముళ్ల లాఠీలతో మహిళలు, మైనర్లపై దాడులు చేశారు."

**'ఫేషియల్ రికగ్నిషన్, బజరంగ్ దళ్ దాడులకు పాల్పడుతున్నారు'**

మరోవైపు, శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై దాడులు చేయడం తనకు తీవ్ర ఆందోళన కలిగించిందని రాహుల్? పేర్కొన్నారు. హోం మంత్రి, ఆయన భావజాలం కలిగిన వారు తెరవెనుక ఉండి ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. "వారు 'ఫేషియల్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) సాంకేతికతను వాడుతున్నారు, విద్యార్థులను బెదిరిస్తున్నారు. అంతేకాకుండా బజరంగ్ దళ్‌ను వారిపై ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నారు. అందుకే నేను ఈ రోజు ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నాను. ఈ విషయంపై అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటున్నా. ప్రభుత్వం ఇలాంటి పనులు చేస్తోందన్న విషయం ప్రతి విద్యార్థికీ, వారి తల్లిదండ్రులకూ తెలియాలని నేను కోరుకుంటున్నా. వీరు మన పిల్లలు, మన భవిష్యత్తు. వారిపై దాడి చేయడం, బెదిరించడం, కొట్టడం లేదా కనీసం వారిని తాకడం కూడా ప్రభుత్వానికి తగదు. విద్యార్థులు ఎలాంటి నేరమూ చేయలేదు. ఒకవేళ వారు ఏదైనా నేరం చేసి ఉంటే, వారు నేరం చేశారని, వారికి శిక్ష పడాలని చెప్పే మొదటి వ్యక్తిని నేనే అయ్యేవాడిని. కానీ ఈ యువతీయువకులు ఏ తప్పూ చేయలేదు" అని రాహుల్? గాంధీ పేర్కన్నారు.

**'నా మైక్‌ను మాత్రమే ఆపగలరు'**

అంతకుముందు కూడా, పేపర్ లీక్ నిరోధక చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో తాను మాట్లాడకుండా బీజేపీ అడ్డుకుందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. తన ప్రసంగంలో దిల్లీలో విద్యార్థులపై జరిగిన దమనకాండను ప్రస్తావించినట్లు చెప్పారు. అందుకు హోంమంత్రి అమిత్ షానే బాధ్యుడని పేర్కొన్నట్లు రాహుల్ చెప్పారు. అధికార పక్ష సభ్యులు తన మైక్‌ను మాత్రమే ఆపగలరు కానీ విద్యార్థుల ప్రతిధ్వనిని ఆపలేరంటూ ఎక్స్ పోస్టులో రాహుల్ పేర్కొన్నారు.

## 2028 నాటికి ఈవీ ఎయిర్ అంబులెన్స్, ట్యాక్సీలు

**రన్‌వే లేకుండానే టేకాఫ్, ల్యాండింగ్!**

**నగరాల్లో అత్యవసర రోగులను రక్షించేందుకు ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్స్**

**హెలికాప్టర్ల కంటే తక్కువ ఖర్చు- హెలిప్యాడ్‌తో పనిలేకుండా ఇళ్ల పైకప్పుల పైనే ల్యాండింగ్?**

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి ఆస్పత్రికి చేరడం ఆలస్యమై ప్రాణాలు పోయే పరిస్థితులకు త్వరలోనే చెక్ పడబోతోంది. నగరాల్లో అత్యవసర రోగులను రక్షించేందుకు ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్స్ సిద్ధమవుతోంది. హెలికాప్టర్ల కంటే తక్కువ ఖర్చుతో, హెలిప్యాడ్‌తో పనిలేకుండా నేరుగా ఇళ్ల పైకప్పుల పైనే ఈ 'గాలి మోటారు' ల్యాండ్ కాగలదు. 2028 నాటికి రానున్న ఈ విద్యుత్ విహంగం కథేంటో ఇప్పుడు చూద్దాం. చెన్నై వంటి మహానగరాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ వల్ల అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు పరిష్కారంగా గాల్లో ప్రయాణించే విద్యుత్ ఎయిర్ అంబులెన్స్‌ను చెన్నై ఐఐటీ ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న 'ది ఇ ప్లేన్ కంపెనీ' స్టార్టప్ నిపుణులు రూపకల్పన చేశారు. ఐఐటీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ సత్యా చక్రవర్తి నేతృత్వంలో రూపొందుతున్న ఈ విద్యుత్ విమానానికి సంబంధించి, ఇప్పటికే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి అనుమతులు లభించాయి.

**ఎయిర్ అంబులెన్స్‌ల సేవలు**

భారత్‌లోని పలు నగరాల్లో ఇప్పటికే ఎయిర్ అంబులెన్స్‌ల సేవలు ఉన్నాయి. అయితే అవన్నీ హెలికాప్టర్లు లేదా చిన్న సైజు విమానాలు. కానీ ది ఇ-ప్లేన్ కంపెనీ తయారు చేస్తోంది విద్యుత్ విహంగం కావడం గమనార్హం. హెలికాప్టర్‌ను అంబులెన్స్‌గా వాడితే లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇది విద్యుత్‌తో నడవడం వల్ల ఛార్జీలు, నిర్వహణ ఖర్చు చాలా తక్కువ. హెలిప్యాడ్, ఎయిర్‌స్ట్రిప్‌తో పనిలేదు. ఉన్న చోటు నుంచే నిలువుగా పైకి లేవడం, కిందకు దిగడం దీని ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 100 కిలోమీటర్ల దూరం వెళ్లే ఈ విహంగంలో 750 కిలోల లిథియం-అయోడిన్ బ్యాటరీ ఉంటుంది. పైలట్‌తో పాటు రోగి, నర్స్ వెళ్లేలా డిజైన్ చేశారు. అలాగే ఒక పైలట్, ఇద్దరు ప్రయాణికులు వెళ్లేలా ఎయిర్ టాక్సీని సిద్ధం చేస్తున్నారు. భవనాల పైకప్పులపై కేవలం 5వేల చదరపు అడుగుల స్థలం ఉంటే ఇవి సులభంగా ల్యాండ్ కాగలవు. ప్రస్తుతం ఐఐటీ తయ్యూర్ క్యాంపస్‌లో ప్రయోగ పరీక్షలు జరుపుకొంటున్న ఈ గాలి మోటరు, అన్ని అనుమతులు పూర్తయి 2028 నాటికి అందుబాటులోకి రానుంది. "ప్రస్తుతం మేం ఎయిర్ టాక్సీ నమూనాను రూపొందిస్తున్నాం. దాని భాగాలను సమీకరిస్తున్నాం. సివిల్ ఏవియేషన్ అథారిటీ నియంత్రణ నిబంధనలను మేరకు ఇందులో ఎగిరే ఎత్తు, శిక్షణ, భద్రతా విధానాలు, ల్యాండింగ్ ప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పాటిస్తున్నాం. ఈ ఎయిర్ టాక్సీని రిమోట్‌గా ఆపరేట్ చేస్తారు. అయితే, ప్రస్తుతం మేం ఎయిర్ టాక్సీ, ఎయిర్ అంబులెన్స్ రెండింటినీ అభివృద్ధి చేస్తున్నాం. అయితే, తొలుత ఎయిర్ అంబులెన్స్‌ను అభివృద్ధి చేస్తాం. దీనిలో ఒక పైలట్, రోగి, శిక్షణ పొందిన నర్సుతో సహా ముగ్గురిని తీసుకువెళ్లేలా రూపొందిస్తాం. ఇక, ఎయిర్? టాక్సీ విషయానికొస్తే, అందులో ఒక పైలట్, ఇద్దరు ప్రయాణికులు వెళ్లేలా రూపొందిస్తున్నాం. ఒక సంవత్సరంలోగా, ఎయిర్ అంబులెన్స్, ఎయిర్ టాక్సీ డిజైన్‌ను పూర్తి చేసి, దానిని భారత పౌర విమానయాన సంస్థ (సివిల్ ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ద్వారా పరీక్ష కోసం పంపుతాం. వారు ఆమోదం తెలిపిన తర్వాత, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం"

**రన్‌వే లేకుండానే టేకాఫ్, ల్యాండింగ్**

అయితే, ఈ-ప్లేన్ డిజైన్ కోసం 2023లోనే ధ్రువీకరణ పత్రాలను పొందామని, ఈ-ప్లేన్ టాక్సీ ఆపరేటర్లకు అందించే శిక్షణ, విమానాల పైలట్లకు అందించే శిక్షణ మాదిరిగానే ఉంటుందని ప్రొఫెసర్ పేర్కొన్నారు. అయితే, ఈ టాక్సీల మరో ప్రత్యేకత ఏమిటంటే, రన్‌వే లేని ప్రదేశం నుంచి కూడా నేరుగా టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేలా ఈ-ప్లేన్ టాక్సీ రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137